RNI No: TGTEL/25/A2649

# వాయిస్ ఆఫ్ ప్రజలు

VOICE OF PRAJALU

ప్రజల గొంతుక - నిజం కోసం..

Powered by Voice Today

తెలుగు దినపత్రిక

మంగళవారం, మార్చి 31, 2026

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన



'సహజీవన జంటలకు' కూడా కుటుంబ హోదా

# ఆహార కల్తీ నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థ




- సన్నబియ్యం పథకంతో పేదలకు నాణ్యమైన ఆహారం
- రైతులకు బలం కోసం పంటల మార్పిడి, బోనస్ ప్రోత్సాహం
- నిత్యావసరాల అక్రమ నిల్వలపై కఠిన చర్యలు హెచ్చరిక
- విద్యార్థులకు పౌష్టికాహారం, నాణ్యమైన విద్యపై దృష్టి
- లోక్‌సభ సీట్ల పెంపులో దక్షిణాదికి న్యాయం చేయాలి
- మీడియా చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 31: రాష్ట్రంలో ఆహార కల్తీని పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈగల్, హైడ్రా తరహాలో ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి కల్తీ నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపడతామని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న చట్టాలను పరిశీలించి తెలంగాణకు అనువైన సమగ్ర విధానాన్ని రూపొందిస్తామని చెప్పారు. పేదలకు నాణ్యమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో చేపట్టిన సన్నబియ్యం పథకం విజయవంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు.

రైతులు పండించే పంటలకు సరైన ధర నిర్ణయించే హక్కు లేకపోవడం బాధాకరమని సీఎం అన్నారు. దీనికి పరిష్కారంగా కనీస మద్దతు ధర చట్టాన్ని తీసుకువచ్చామని వివరించారు. పంటల మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించి, వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. జిల్లాల వారీగా పంటలపై శాస్త్రీయ అధ్యయనం చేసేందుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా శాసనసభలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామని చెప్పారు.

రాష్ట్రంలో ఇప్పటివరకు రేషన్ ద్వారా దొడ్డుబియ్యం మాత్రమే పంపిణీ అవుతుండగా, ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం అందించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టామని సీఎం వివరించారు. ప్రస్తుతం రాష్ట్ర జనాభాలో

(మిగతా 2వ పేజీలో)



## పశ్చిమాసియా యుద్ధంపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

- భారత్ చొరవ తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం
- పారాక్వాట్ వినియోగంపై ఆందోళన వ్యక్తం చేసిన ప్రభుత్వం
- రైతులు, కూలీల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు
- ఇప్పటికే పలు దేశాల్లో నిషేధిత గడ్డి మందు
- 2 కీలక తీర్మానాలకు అసెంబ్లీలో ఏకగ్రీవ ఆమోదం



## మంత్రి పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలి

- మైనింగ్ అక్రమాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నేతలు
- హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలని డిమాండ్
- లోక్‌భవన్‌లో గవర్నర్‌తో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ

హైదరాబాద్, మార్చి 31: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారాస నేతలు గవర్నర్ శివప్రతాప్ శుక్లాను ఆశ్రయించారు. ఆయనను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, మైనింగ్ అక్రమాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నేతృత్వంలో హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. గవర్నర్‌తో వారి భేటీ గంటకు పైగా కొనసాగింది. అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్ రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించిన మైనింగ్ అక్రమాలపై గవర్నర్‌కు పూర్తి వివరాలు అందజేశామని తెలిపారు. హిమాయత్‌సాగర్, ఓఆర్ఆర్ పరిధుల్లో నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ జరుగుతోందని, ఎలాంటి అనుమతులు లేకుండా రెండేళ్లుగా భారీ స్థాయిలో ప్రజా సంపద దోపిడీ జరుగుతోందని వివరించామని చెప్పారు. రెవెన్యూ మంత్రి కుటుంబ సభ్యులకు చెందిన సంస్థ ద్వారా రూ.వందల కోట్ల విలువైన ఖనిజ సంపద అక్రమంగా తరలించబడుతోందని ఆరోపించారు. ఈ అంశాన్ని శాసనసభలో లేవనెత్తినందుకు తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసిన విషయాన్ని కూడా గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు కేటీఆర్ తెలిపారు. ముఖ్యమంత్రి వద్దే హోంశాఖ ఉండటంతో సీఐడీ విచారణపై విశ్వాసం లేదని, అందుకే స్వతంత్ర న్యాయ విచారణ అవసరమని గవర్నర్‌ను

(మిగతా 2వ పేజీలో)



## ఒప్పందం లేకపోతే ఇక విధ్వంసమే


- ఇరాన్‌కు ట్రంప్ కఠిన అల్టిమేటం..
- చమురు క్షేత్రాల నుంచి విద్యుత్ వ్యవస్థలదాకా ధ్వంసం చేస్తామన్న అమెరికా
- ఖర్గ్ ద్వీపం స్వాధీనం చేసుకునే అవకాశంపై ట్రంప్ వ్యాఖ్యలు
- అమెరికా డిమాండ్లను తిప్పికొట్టిన ఇరాన్.. ప్రతిదాడులు కొనసాగింపు
- పర్షియన్ గల్ఫ్‌ను సముద్రమైన్లతో నింపేస్తామన్న టెహ్రాన్ హెచ్చరిక
- పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతలు మరింత తీవ్రం

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. యురేనియం నిల్వలను అప్పగించి, శాంతి ఒప్పందానికి సిద్ధంకాకపోతే ఇరాన్‌ను పూర్తిగా ధ్వంసం చేస్తామని ఆయన అల్టిమేటం ఇచ్చారు. ఈ మేరకు తన సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో పలు వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఇరాన్ నాయకత్వంతో చర్చలు జరుగుతున్నాయని, అవి సానుకూల దిశలో సాగుతున్నాయని తెలిపారు. అయితే ఒప్పందం కుదరకపోతే తీవ్ర చర్యలకు దిగుతామని స్పష్టం చేశారు. హోర్ముజ్ జల సంధిని అంతర్జాతీయ రవాణాకు తెరవకపోతే ఇప్పటివరకు చూపిన సహనానికి ముగింపు పలుకుతామని ట్రంప్ హెచ్చరించారు. అవసరమైతే ఇరాన్‌లోని చమురు క్షేత్రాలు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ఆయిల్ రిఫైనరీలు, డీశాలినేషన్ ప్లాంట్లు సహా కీలక మౌలిక సదుపాయాలన్నింటినీ లక్ష్యంగా చేసుకుంటామని పేర్కొన్నారు. గత దశాబ్దాల్లో అమెరికా సైనికులపై జరిగిన దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని

(మిగతా 2వ పేజీలో)

# నక్సలిజం ఇక ముగిసిన అధ్యాయం

- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా
- తెలంగాణ--ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో 21 రోజుల భీకర పోరు
- కేంద్ర బలగాల సంయుక్త చర్యలతో స్థావరాల నిర్వీర్యం
- తెలంగాణ నక్సల్స్‌రహిత రాష్ట్రంగా మారిందని వ్యాఖ్య
- నక్సలిజం విస్తరణకు కాంగ్రెస్ మద్దతు ఉందని ఆరోపణ
- భద్రతా బలగాల త్యాగాలకు లోక్‌సభలో సెల్యూట్



న్యూఢిల్లీ : దశాబ్దాలుగా దేశాన్ని, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలను భయాందోళనలకు గురిచేసిన వామపక్ష తీవ్రవాదం (నక్సలిజం) దాదాపు అంతమైందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. లోక్‌సభలో మాట్లాడిన ఆయన, తెలంగాణ--ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో చేపట్టిన చరిత్రాత్మక 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్' విజయంతో తెలంగాణ పూర్తిస్థాయిలో నక్సల్స్‌రహిత రాష్ట్రంగా మారిందని తెలిపారు. దేశవ్యాప్తంగా నక్సలిజాన్ని నిర్మూలించడంలో భద్రతా బలగాలు చేసిన త్యాగాలను ఆయన ప్రశంసిస్తూ సభలో సెల్యూట్ చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, నక్సలిజం విస్తరణకు దశాబ్దాలుగా ఆ పార్టీ, గాంధీ కుటుంబం కారణమని ఆరోపించారు. తెలంగాణ--ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని దట్టమైన అడవుల్లో మావోయిస్టులు సంవత్సరాలుగా బలమైన స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నారని అమిత్ షా వివరించారు. సుమారు 50 కి.మీ పొడవు, 37 కి.మీ వెడల్పు ఉన్న కొండ ప్రాంతంలో వారు శాశ్వతంగా ఉండేలా ఏర్పాట్లు చేసుకున్నారని తెలిపారు. అక్కడ సోలార్ విద్యుత్ వ్యవస్థలు, ఐఈడీ తయారీ కేంద్రాలు, ఐదేళ్లకు సరిపడా ఆహార నిల్వలు కూడా ఉన్నాయని చెప్పారు. 400 నుంచి 500 మంది కేడర్ అక్కడ ఉండేవారని వెల్లడించారు. ఈ స్థావరాన్ని ధ్వంసం చేయడానికి కోబ్రా, సీఆర్పీఎఫ్, డీఆర్జీ బలగాలు, ఛత్తీస్‌గఢ్ పోలీసులు కలిసి 21 రోజులపాటు 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్' నిర్వహించారని తెలిపారు. తీవ్రమైన ఎండలో, పరిమిత వనరులతో జవాన్లు పోరాడారని చెప్పారు. రోజుకు కేవలం 300 మిల్లీలీటర్ల నీటితోనే ధైర్యంగా

(మిగతా 2వ పేజీలో)



## జాతీయ భద్రతకు ముప్పుగా అక్రమ చొరబాట్లు: ప్రధాని

- అస్సాం గుర్తింపును కాపాడాల్సిన బాధ్యత అందరిది
- కాంగ్రెస్ పాలనపై యువ ఓటర్లు ఆలోచించాలి: మోదీ
- బీజేపీ కార్యకర్తలు హ్యాట్రిక్ విజయం కోసం కృషి చేయాలి
- శాంతి ఒప్పందాలతో ఈశాన్యలో స్థిరత్వం: కేంద్రం
- చొరబాట్లను అడ్డుకోవడంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల పాత్ర

న్యూఢిల్లీ: అస్సాంలో అక్రమ చొరబాట్ల సమస్యను కేవలం ఎన్నికల ప్రచార అంశంగా చూడరాదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇది దేశ పౌరుల గుర్తింపు, జాతీయ భద్రతకు సంబంధించిన కీలక అంశమని ఆయన పేర్కొన్నారు. అస్సాంలో త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో 'మేరా బూత్, సబ్‌సే మజ్‌బూత్ సంవాద్' కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న మోదీ

(మిగతా 2వ పేజీలో)



## లక్ష కోట్ల ప్రజాధనం వృథా

:: కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్రమంత్రి సంచలన వ్యాఖ్యలు

# గిగ్ వర్కర్లకు భరోసా.. బిల్లుకు గ్రీన్‌సిగ్నల్

- అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రత్యేక చట్టం
- గిగ్ వర్కర్ల నమోదు, సంక్షేమానికి కొత్త విధానం
- 20 మంది సభ్యులతో ప్రత్యేక బోర్డు ఏర్పాటు
- వేతనాలు, భద్రతపై నిబంధనలు రూపకల్పన
- ప్రతి వర్కర్‌కు యూనిక్ ఐడీ
- శాసనసభలో బిల్లుకు ఏకగ్రీవ ఆమోదం



హైదరాబాద్: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న గిగ్ వర్కర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన గిగ్ వర్కర్ల బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. కార్మిక ఉపాధిశాఖ మంత్రి వివేక్ సోమవారం ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టి దాని ముఖ్యాంశాలను వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు నాలుగు లక్షల మంది గిగ్ వర్కర్లు వివిధ రంగాల్లో పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. వీరి సంక్షేమానికి ఇప్పటివరకు సరైన వ్యవస్థ లేకపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని

(మిగతా 2వ పేజీలో)

# పశ్చిమాసియా యుద్ధంపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

**భారత్ చొరవ తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం**

**పారాక్వాట్ వినియోగంపై ఆందోళన వ్యక్తం చేసిన ప్రభుత్వం**

**రైతులు, కూలీల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు**

**ఇప్పటికే పలు దేశాల్లో నిషేధిత గడ్డి మందు**

**2 కీలక తీర్మానాలకు అసెంబ్లీలో ఏకగ్రీవ ఆమోదం**



హైదరాబాద్: పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధాన్ని తక్షణం ఆపేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టి యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏర్పడుతున్న ప్రభావాలను వివరించారు. అలాగే వ్యవసాయంలో వినియోగిస్తున్న ప్రమాదకర గడ్డి మందు పారాక్వాట్‌ను శాశ్వతంగా నిషేధించాలని కోరుతూ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రవేశపెట్టిన మరో తీర్మానానికీ సభ మద్దతు తెలిపింది. భట్టి విక్రమార్క మాట్లాడుతూ పశ్చిమాసియా యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ఈ యు ద్ధంలో వేలాది నిరపరాధులు ప్రాణాలు కోల్పోయారని, పరిస్థితి మరింత దిగజారితే మూడో ప్రపంచ యుద్ధానికి దారితీయవచ్చని హెచ్చరించారు. గల్ఫ్ దేశాల్లో లక్షలాది భారతీయులు నివసిస్తున్న నేపథ్యంలో వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్రం తక్షణ చర్యలు తీసుకో వాలని కోరారు. మరోవైపు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గడ్డి మందు పారా క్వాట్ వల్ల కలుగుతున్న ప్రమాదాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కలుపు మొక్కలను నాశనం చేయడానికి ఉపయోగిస్తున్న ఈ రసాయనం రైతులు, వ్యవసాయ కార్మికుల ఆరోగ్యానికి పెద్ద ముప్పుగా మారిందన్నారు. దీన్ని పీల్చడం వల్ల చర్మవ్యాధులు, శ్వాసకోశ సమస్యలు పెరుగు తున్నాయని తెలిపారు. ఇక ఆత్మహత్యల కోసం కూడా ఈ మందును వినియోగిస్తున్న ఘటనలు పెరుగుతున్నా యని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం వేలాది మంది ఈ విషపదార్థం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని వెల్లడించారు. ఇప్పటికే ప్రపంచంలోని అనేక దేశాలు పారాక్వాట్‌ను నిషేధించాయని, భారత్‌లో కూడా దీనిపై కఠిన నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. ప్రస్తుతం ఈ మందు అమ్మకానికి కొన్ని నియంత్రణలు ఉన్నప్పటికీ అవి సరైన విధంగా అమలవడం లేదని మంత్రి పేర్కొన్నారు. అందుకే దీని తయారీ, దిగుమతి, వినియోగంపై పూర్తి నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. ఈ రెండు అంశాల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని శాసనసభ సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానాలను ఆమోదించారు. ప్రపంచ శాంతి, ప్రజల ఆరోగ్యం అనే రెండు కీలక విషయాలపై రాష్ట్రం తన అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేసినట్లైంది.

# ఒప్పందం లేకపోతే ఇక విధ్వంసమే



తెలిపారు. ఇరాన్ చమురు రంగానికి కీలకమైన ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే అవకాశాన్ని కూడా ట్రంప్ ప్రస్తావించారు. అవసరమైతే ఆ ద్వీపాన్ని నియంత్రణలోకి తీసుకునే చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనిపై తాము పలు ఆప్షన్లను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఇరాన్‌కు ఆ ప్రాంతాన్ని రక్షించే సామర్థ్యం తక్కువగా ఉందని వ్యా ఖ్యానించారు. అమెరికా ప్రతిపాదించిన 15 అంశాల డిమాండ్లను ఇరాన్ పూర్తిగా తిరస్కరించింది. అవి అసంబద్ధ మైనవి, వాస్తవాలకు విరుద్ధమైనవని విమర్శించింది. అమెరికా సేనలు గల్ఫ్ ప్రాంతంలోకి ప్రవేశిస్తే పర్షియన్ గల్ఫ్‌ను సముద్రమైన్లతో నింపేస్తామని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి హెచ్చరించారు. అమెరికా దౌత్య వైఖరి స్థిరంగా లేదని, మాట మారుస్తోందని విమర్శించారు. మధ్యవర్తిత్వంపై కూడా ఇరాన్ స్పష్టతనిచ్చింది. పాకిస్తాన్ మధ్యవర్తిత్వం అవసరం లేదని పేర్కొంది. ప్రస్తుతం అమెరికాతో నేరుగా చర్చలు లేవని, కేవలం పరోక్ష ప్రతిపాదనలు మాత్రమే వస్తున్నాయని తెలిపింది. అమెరికా సైనికులు తమ భూభాగంలోకి వస్తే తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ హెచ్చరించారు. ఇదిలా ఉండగా, ఇరాన్ తన దాడులను కొనసాగిస్తోంది. కువైట్‌లోని విద్యుత్, జల కేంద్రంపై బాంబుదాడి జరిపింది. ఇజ్రాయెల్‌లోని హైఫా నగరంలోని ఆయిల్ రిఫైనరీపై క్షిపణులు ప్రయోగించింది. సౌదీ అరేబియా, దుబాయ్ ప్రాంతాల్లో కూడా క్షిపణి దాడులు జరిగాయి. కొన్ని క్షిపణులను గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయి. ఇజ్రాయెల్ అణు పరిశోధనా కేంద్రాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని దాడులు జరగడంతో అక్కడ హెచ్చరికలు మోగాయి. ఇప్పటివరకు అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో 1,900 మంది మరణించారని ఇరాన్ ప్రకటించింది. మరోవైపు లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడుల్లో ఐరాస శాంతి బలగాల సభ్యులు మరణించారు. ఇరాక్‌లోని వైమానిక స్థావరంపై రాకెట్ దాడి జరిగి ఒక రవాణా విమానం ధ్వంసమైంది.

ఈ పరిస్థితుల్లో స్పెయిన్ తమ గగనతలాన్ని మూసివేసింది. అమెరికా తమ ఎయిర్‌స్పేస్‌ను యుద్ధ కార్యకలాపాలకు వినియోగిస్తోందని ఆరోపిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. యుద్ధం చట్టవ్యతిరేకమని స్పెయిన్ అభిప్రాయపడింది. ఇక ఇరాన్ నేవీకి చెందిన ఉన్నతాధికారి అలీరెజా తంగసిరి ఇటీవల దాడుల్లో మరణించినట్లు అధికారికంగా ధృవీకరించింది. దేశ సేవలో ఆయన ప్రాణత్యాగం చేశారని పేర్కొంది. కువైట్‌లో జరిగిన దాడిలో ఒక భారతీయుడు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో పశ్చిమాసియా ఘర్షణల్లో మృతి చెందిన భారతీయుల సంఖ్య ఎనిమిదికి చేరింది. ఈ పరిణామాలన్నింటితో ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగి యుద్ధ వాతావరణం తీవ్రరూపం దాల్చుతోంది.

# లక్ష కోట్ల ప్రజాధనం వృథా

### ::: కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్రమంత్రి సంచలన వ్యాఖ్యలు



కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాజెక్టుపై రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ, లక్ష కోట్ల ప్రజాధనం వృథాగా నీళ్లలో పోశారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలను కేంద్ర బృందం అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్ లోపాలు కారణమని అన్నారు. కాళేశ్వరంను జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలని రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ప్రజాధనం వృథా అయిందని ఆరోపించారు. కాగా, ఈ ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐతో విచారణ జరిపించాలని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ఇంకా మాట్లాడుతూ, జల్ జీవన్ నిధుల వినియోగంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ళుగా ఒక్క ప్రతిపాదన పంపించలేదని అన్నారు. తెలంగాణ వద్ద జల్ జీవన్ మిషన్ నిధులు రూ.873 కోట్లు ఉన్నట్లు తెలిపారు. అంత పెద్ద మొత్తంలో నిధులు ఉన్నప్పటికీ రూ.194 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని విమర్శించారు.

# శ్మశానంలో గ్యాస్ సిలిండర్ల దందా...

# హైదరాబాద్‌లో భారీ రాకెట్ గుట్టురట్టు



హైదరాబాద్ : హైదరాబాద్‌లో భారీ అక్రమ గ్యాస్ సిలిండర్ల రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. గల్ఫ్ యుద్ధం కారణంగా ఏర్పడిన ఎల్పీజీ కొరతను ఆసరాగా చేసుకుని అధిక ధరలకు సిలిండర్లను విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్‌లోని ఓ శ్మశాన వాటికలో అక్రమంగా నిల్వ ఉంచిన 414 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని, ఈ దందాకు పాల్పడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్, బంజారాహిల్స్ పోలీసులు సోమవారం ఈ జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. నిందితులు అధిక లాభం కోసం సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్నారని పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ తెలిపారు. వారి నుంచి 11 రవాణా వాహనాలతో కలిపి మొత్తం రూ.21.88 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పోలీసుల కథనం ప్రకారం, శంషాబాద్ కేంద్రంగా 'మెట్రో గ్యాస్ ఏజెన్సీ' నిర్వహిస్తున్న మహ్మద్ అమీర్ ఈ రాకెట్‌లో ప్రధాన సూత్రధారి. ఇతను బంజారాహిల్స్‌లోని నాగార్జున ఎక్స్ రోడ్ సమీపంలోని శ్మశానంలో హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసి, అవసరమైన వారికి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో గ్యాస్ ఏజెన్సీ యజమాని, డెలివరీ బాయ్స్, డ్రైవర్లు, కార్మికులు ఉన్నారు. స్వాధీనం చేసుకున్న వాటిలో వివిధ కేజీల బరువున్న సిలిండర్లు, డీసీఎం వ్యాన్లు, బొలెరో వాహనాలు, ఆటోలు ఉన్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన...

## 'సహజీవన జంటలకు' కూడా కుటుంబ హోదా



భారతదేశ జనాభా లెక్కల సేకరణలో కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. 2021లో కోవిడ్ కారణంగా వాయిదా పడిన 16వ జనగణన ప్రక్రియ ఈ ఏడాది ఏప్రిల్ 1న ప్రారంభం కానుంది. ఈసారి జనాభా లెక్కల్లో మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలను సవరించారు. ఇందులో భాగంగా, చాలా కాలంగా కలిసి ఉంటున్న సహజీవన జంటలను ఇకపై 'కుటుంబం'గా గుర్తించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ ఈరోజు వివరాలను వెల్లడించారు.

**రెండు దశల్లో జనగణన:**

తొలి దశ (ఏప్రిల్ 1 నుంచి): ఈ దశలో 'గృహ గణన' చేపడతారు. అధికారులు మొబైల్ యాప్ ద్వారా ఇంటింటికీ వెళ్లి గృహాల వివరాలను సేకరిస్తారు.

రెండో దశ (వచ్చే ఏడాది ఫిబ్రవరి): ఈ దశలో అసలైన జనాభా లెక్కల సేకరణ జరుగుతుంది. జనగణన కోసం కేంద్రం ప్రత్యేకంగా 33 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని సిద్ధం చేసింది. ఇందులో కుటుంబ యజమాని వివరాలు, కులం, కమ్యూనిటీతో పాటు ఇంట్లోని వసతులపై ఆరా తీయనున్నారు. ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్ నుంచి కారు వరకు), టీవీ, రేడియో వంటి గృహోపకరణాలపై ప్రశ్నలు ఉంటాయి. తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వినియోగం, వంటగది సౌకర్యాలు, వినియోగించే ఇంధనం మరియు తృణధాన్యాల వాడకం వంటి వివరాలను సేకరిస్తారు. ఈసారి జనగణనలో మరో విశేషం ఏమిటంటే, పౌరులు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే (ావశ్రీట జుఅబఎవతీఖ్‌అశీఅ) అవకాశాన్ని కేంద్రం కల్పించింది. దేశంలో సాధారణంగా ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణన జరుగుతుంది. చివరిసారిగా 2011లో జనాభా లెక్కలు సేకరించగా, దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జరుగుతున్న ఈ ప్రక్రియపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. ఈ గణాంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల రూపకల్పనకు, నిధుల కేటాయింపులకు అత్యంత కీలకం కానున్నాయి.

## ఆహార కల్తీ నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థ



86 శాతం మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని, భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అవసరమైతే 100 శాతం ప్రజలకు కూడా సన్నబియ్యం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పిల్లల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం పౌష్టికాహారం ఎంతో అవసరమని ఆయన అన్నారు. రైతులకు ఆర్థికంగా బలం చేకూర్చేందుకు సన్నబియ్యం సాగుకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామని సీఎం చెప్పారు. దీనివల్ల రైతులకు అదనపు లాభం వస్తోందని తెలిపారు. ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రజలకు పంపిణీ చేస్తోందని వివరించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని చెప్పారు. నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ చేయడం తీవ్రమైన నేరమని సీఎం హెచ్చరించారు. ప్రజల అవసరాలను దోపిడీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిత్యావసర ధరలు నియంత్రణలో ఉన్నాయని తెలిపారు. రేషన్ ద్వారా సన్నబియ్యంతో పాటు ఇతర అవసరమైన వస్తువులను కూడా అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. లోక్‌సభ సీట్ల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకూడదని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రస్తుత సీట్ల నిష్పత్తిని దృష్టిలో ఉంచుకుని పెంపు జరగాలని అన్నారు. జనాభా ఆధారంగా లేదా 50 శాతం పెంపు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం కలుగుతుందని తెలిపారు. అందుకే ఈ అంశంపై ప్రజల్లో చర్చ జరగాలని, అన్ని పార్టీలూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణకు చెందాల్సిన నిధులు తిరిగి ఇవ్వడం లేదని కూడా ఆయన విమర్శించారు.

## మంత్రి పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలి

కోరినట్లు చెప్పారు. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కూడిన సభాసంఘం లేదా స్వతంత్ర జ్యుడిషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. అన్ని అంశాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని గవర్నర్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజాక్షేత్రంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు. అక్రమ మైనింగ్ ఆగే వరకు, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విచారణకు సిద్ధమని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పుడు మాట మార్చారని విమర్శించారు. అమృత్ టెండర్లు, ఫోన్ ట్యాపింగ్, సింగరేణి, హిల్ట్ పాలసీ తదితర అంశాల్లో దాదాపు 14 కేసులకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, ప్రభుత్వం నిజాయితీగా విచారణ చేస్తే వాటిని సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇప్పటికైనా పొంగులేటిపై చర్యలు తీసుకుని ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, మంత్రి పొంగులేటి మైనింగ్ వ్యవహారంపై గన్‌పార్క్‌లో భారాస ఎమ్మెల్సీలు నిరసన చేపట్టారు. తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభాసంఘం ఏర్పాటు చేయాలని లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం పాదయాత్రగా శాసనమండలికి వెళ్లారు.

# నక్సలిజం ఇక ముగిసిన అధ్యాయం

యుద్ధం కొనసాగించారని వివరించారు. ఈ ఆపరేషన్‌లో 30 మందికిపైగా మావోయిస్టులు హతమయ్యారని, మిగిలిన వారు లొంగిపోయారని లేదా పారిపోతూ పట్టుబడ్డారని తెలిపారు. ఈ విజయంతో బస్తర్, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల్లో మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తగ్గిపోయిందని చెప్పారు. 2024 ప్రారంభంలో మావోయిస్టు కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలో 21 మంది సభ్యులు ఉండగా ప్రస్తుతం వారి శక్తి పూర్తిగా క్షీణించిందని అమిత్ షా తెలిపారు. కొందరు హతమయ్యారు, మరికొందరు లొంగిపోయారు, ఒకరు మాత్రమే పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. దండకారణ్య జోనల్ కమిటీ కూడా పూర్తిగా నిర్వీర్యమైందని తెలిపారు. తెలంగాణలో రాష్ట్ర కమిటీలో ఉన్న నాయకుల్లో కొందరు లొంగిపోయారు, మరికొందరు ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఒక్క నక్సలైట్ కూడా లేదని స్పష్టం చేశారు. నక్సలిజం వ్యాప్తికి కాంగ్రెస్ పార్టీ గతంలో మద్దతు ఇచ్చిందని అమిత్ షా ఆరోపించారు. 1970లలో జరిగిన రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ, ఆ సమయంలో మావోయిస్టుల మద్దతుతో వారు ప్రభావాన్ని పెంచుకున్నారని అన్నారు. తద్వారా దేశంలో 'రెడ్ కారిడార్' విస్తరించిందని పేర్కొన్నారు. అలాగే నక్సల్స్‌కు వ్యతిరేకంగా ప్రారంభించిన 'సల్వాజుడుం' ఉద్యమాన్ని కోర్టు రద్దు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, దాని వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు, ముఖ్యంగా రాహుల్ గాంధీ నక్సల్స్‌కు సానుభూతిపరులతో కలిసి పనిచేశారని కూడా ఆయన ఆరోపించారు. వివిధ సందర్భాల్లో నక్సల్స్‌కు చెందిన వ్యక్తులతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్నారని చెప్పారు. 1970 నుంచి ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ నక్సలిజానికి పరోక్ష మద్దతు ఇస్తూనే ఉందని విమర్శించారు. నక్సల్స్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వేలాది మంది పౌరులు, భద్రతా సిబ్బంది మరణాలకు కాంగ్రెస్ బాధ్యత వహించాలన్నారు.

## జాతీయ భద్రతకు ముప్పుగా అక్రమ చొరబాట్లు: ప్రధాని

ఈ వ్యాఖ్యలు చేశారు. అస్సాంలో తొలిసారి ఓటు హక్కు వినియోగించనున్న యువత గత కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనను గుర్తు చేసుకోవాలని సూచించారు. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం మళ్లీ అభివృద్ధి మార్గం నుంచి తప్పిపోతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావాలంటే కార్యకర్తలు కష్టపడాలని పిలుపునిచ్చారు. అక్రమ చొరబాట్లు రాష్ట్ర ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ప్రధాని తెలిపారు. చొరబాటుదారులు భూములను ఆక్రమించడం, స్థానిక వ్యాపారాలను స్వాధీనం చేసుకోవడం వల్ల స్థానికుల జీవనోపాధి దెబ్బతింటోందన్నారు. కాంగ్రెస్ పాలనలో ఈ సమస్యలను ప్రోత్సహించగా, బీజేపీ ప్రభుత్వం వాటిని అడ్డుకుందని పేర్కొన్నారు. ఈశాన్య భారతంలో శాంతి స్థాపన కోసం కేంద్ర ప్రభుత్వం పలు సంస్థలతో 12 శాంతి ఒప్పందాలు కుదుర్చుకుందని తెలిపారు. అయితే కాంగ్రెస్ హయాంలో ఈ ఒప్పందాలు అమలు కాలేదని విమర్శించారు. గతంలో హింసతో బాధపడిన ప్రాంతాలు ఇప్పుడు శాంతి, అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని అన్నారు. బోడోల్యాండ్ వంటి ప్రాంతాల్లో ఒకప్పుడు కర్ఫ్యూలు, బాంబు దాడులు సాధారణమై ఉండేవని గుర్తుచేశారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారి శాంతి నెలకొన్నదని తెలిపారు. అస్సాం ఇప్పుడు దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. కార్యకర్తలందరూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా కృత్రిమ మేధస్సుతో రూపొందించే తప్పుడు ఆడియో, వీడియోలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతి కార్యకర్త 'నమో' యాప్‌ను ఉపయోగించి ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారతకు సంబంధించిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కూడా ప్రధాని సూచించారు. పార్టీ బలం కార్యకర్తలేనని, వారి కృషితోనే విజయం సాధ్యమవుతుందని అన్నారు.

# గిగ్ వర్కర్లకు భరోసా.. బిల్లుకు గ్రీన్‌సిగ్నల్

తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా గిగ్ వర్కర్ల నమోదు, సామాజిక భద్రత, సంక్షేమ చర్యలకు స్పష్టమైన మార్గదర్శకాలు అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. గిగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించేందుకు అగ్రిగేటర్లు మరియు ఇతర విభాగాల ప్రతినిధులతో కలిపి మొత్తం 20 మంది సభ్యులతో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ బోర్డు ప్రతి మూడు నెలలకు సమావేశమై వర్కర్ల సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటుందని వివరించారు. అదేవిధంగా గిగ్ వర్కర్ల వేతనాలు, ఉద్యోగ భద్రత, వ్యక్తిగత రక్షణకు సంబంధించిన నిబంధనలను రూపొందించనున్నట్లు మంత్రి చెప్పారు. ప్రతి గిగ్ వర్కర్‌కు ప్రత్యేకంగా యూనిక్ ఐడీ కేటాయించడం ద్వారా వారి వివరాలను నమోదు చేసి సంక్షేమ పథకాలను అందించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా భాజపా సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు ఉద్యోగాల నుంచి తొలగింపుల విషయంలో ఇచ్చే నోటీసు కాలాన్ని పెంచాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న ఏడు రోజుల గడువును మూడు నెలలకు పెంచాలని ఆయన అభిప్రాయపడ్డారు. చివరగా మంత్రి వివేక్ సభ్యుల సూచనలను పరిశీలిస్తామని హామీ ఇస్తూ బిల్లును సభ ముందుంచగా, ప్యానల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఓటింగ్ నిర్వహించారు. అనంతరం గిగ్ వర్కర్ల బిల్లును శాసనసభ ఆమోదించినట్లు ప్రకటించారు.

# మహిళలను బీజేపీ నాయకులు చిన్నచూపు చూస్తున్న వైక్కరిని ఖండిస్తున్న

## మేడ్చల్ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మీ




కుత్బుల్లాపూర్ మార్చ్ 30(వాయిస్ టుడే ): ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబ సూచనల మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు స్వర్ణ ఆదేశాల మేరకు పెట్టి మహిళలకు మరియు బాలికలపై పెరుగుతున్న నేరాలు అలాగే కొన్ని కేసుల్లో నిందితులకు కేంద్ర ప్రభుత్వం రక్షణ కల్పిస్తున్న విషయంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజనాల లక్ష్మి ఈ యొక్క ప్రెస్ మీట్ ను పెట్టడం జరిగింది. బిజెపి ప్రభుత్వంలో మహిళలకు లేని భద్రత మరియు బేటి పడావో బేటి బచావో అనే నినాదం మోదీ ఎన్ని సార్లు పలికిన తాను చేస్తున్న అరాచకాలను మహిళా కాంగ్రెస్ ఖండిస్తుంది. అదేవిధంగా చాలావరకు మనము బిజెపిలో ఉన్న ఎమ్మెల్యేలు మహిళలపై అత్యాచారాలు చేసిన విషయాలు వెలికి పడుతున్నాయని మళ్లీ మళ్లీ అదే ధోరణితో బిజెపి ప్రభుత్వం మహిళలపై నేరాలకు వ్యవహరించడం గమనార్హం. ఆమె మాట్లాడుతూ మోది తన వైఖరి మార్చుకోమంటూ మహిళలపై నేరాలను అత్యాచారాలను చేస్తున్న ఎమ్మెల్యేలను మరియు ప్రస్తుతం వెలికి వచ్చిన విషయం తెలిసిందే మధుకేశ్వర్ చెప్పిన నిజాలను వింటుంటే మహిళలను ఇంతగా బిజెపి కించపరుస్తుందని వినడానికే బాధాకరంగా ఉన్నది. భద్రత లేని ప్రభుత్వం కేంద్రంలో పాలన చేయడానికి అర్హత లేదని ఆల్రెడీ వెస్టన్ ఫైల్ లో కూడా బిజెపి నాయకుల పేర్లు ఉన్నాయనీ. అయినా కూడా బిజెపి నాయకులకు మహిళల పైన చిన్నచూపు ఎక్కడ కూడా మహిళలను గౌరవించడం లేదని మహిళలపై చిన్నచూపు చూపిస్తూ రాజకీయ వ్యవస్థలో మహిళలను గౌరవించకపోవడం ఎన్నో అరాచకాలు బలాత్కారాలు మహిళలపై చేస్తున్న బిజెపి నాయకులకు వత్తాసు పలికి రాజకీయంగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడమేకాక వారిని రక్షించడం బిజెపి ప్రభుత్వానికే దక్కింది. మహిళలని ఎక్కడైతే గౌరవిస్తారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు అని. మహిళల విషయంలో 40 మంది దోషులు ఎమ్మెల్యేలను కాపాడుతున్న బిజెపి ప్రభుత్వం మహిళలకు ఎటువంటి రక్షణ కల్పిస్తుంది అని మహిళా కాంగ్రెస్ ఆందోళన చెందుతుంది. కాబట్టి కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వానికి పాలన చేయడానికి ఎటువంటి అర్హతలు కనిపించడం లేదని మహిళలపై అత్యాచారాలు నార్కట్టలేని ప్రధానమంత్రి మోడీ గద్దె దిగితేనే మహిళలకు రక్షణ ఉంటుందని మరియు వారిపైన అరచికాలు తగ్గుతాయని ఆమె వ్యక్తం చేశారు. ఎన్నో కేసులు మహిళలు బిజెపి ఎమ్మెల్యేలపై పెట్టిన సందర్భాలు మనకు తెలిసినవే ఆ యొక్క ఎమ్మెల్యేలను బిజెపి సమర్థించి వారి యొక్క ఎమ్మెల్యేలకు మద్దతు ఇవ్వడం అరాచకం అని ఆమె మాట్లాడారు. భారత్ మాతాకీ జై అంటున్న నోటితోనే మరి మహిళలను కించపరిచి అరాచకాలకు చేస్తున్న బిజెపి నాయకులను మరియు ప్రధానమంత్రి అయినటువంటి నరేంద్ర మోడీ గద్దె దిగవలసిందిగా మహిళా కాంగ్రెస్ డిమాండ్ చేస్తూ ఉంది. ఈ ప్రెస్ మీట్ లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతి సహాయ కార్యదర్శి సరస్వతి డివిజన్ అధ్యక్షురాళ్ళు స్వాతి,మాధవి, కమల, తులసి, సుజాత, సుజాత యాదవ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## కార్మిక గొంతుకలపై ఉక్కుపాదం దారుణం!

- ఖైదీల కంటే హీనమా? అర్ధరాత్రి వేళల్లో ఆశా వర్కర్ల ఇళ్లపై పోలీసుల 'దాడులు'!
- సీఐటీయు ఆధ్వర్యంలో బాలానగర్‌లో నిరసనలు




కూకట్‌పల్లి : మార్చి 30(వాయిస్ టుడే): తమ న్యాయమైన హక్కుల కోసం, కడుపు ఆకలి తీర్చుకోవడం కోసం ప్రశ్నిస్తున్న ఆశా వర్కర్లను, కార్మిక నాయకులను అక్రమంగా నిర్బంధించడం ప్రభుత్వ నిరంకుశత్వానికి పరాకాష్టయని సీఐటియు బాలానగర్ మండల కమిటీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కార్మికులు ప్రభుత్వ మొండి వైఖరిని, పోలీసుల అత్యుత్సాహాన్ని ఖండించారు..ఖైదీల కంటే హీనంగా పోలీసులు కార్మికుల పట్ల ప్రవర్తనే ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని సీఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అనిత పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఖాకీలను అడ్డం పెట్టుకుని పాలన సాగిస్తోందని మండిపడ్డారు. పోలీసులు దొంగలను పట్టుకున్నట్లుగా, అర్ధరాత్రి వేళల్లో కార్మిక నాయకుల ఇళ్లపైకి వెళ్లడం ఏ రకమైన ప్రజాస్వామ్యమని వారు ప్రశ్నించారు. నిద్రపోతున్న మహిళా వర్కర్ల ఇళ్లకు వెళ్లి చుట్టుపక్కల వారిని విచారిస్తూ భయభ్రాంతులకు గురిచేయడం అత్యంత హేయమైన చర్యయని విమర్శించారు. కార్మికులు అద్దె ఇళ్లలో నివసిస్తున్నారనే కనికరం కూడా లేకుండా పోలీసులు పదేపదే రావడం వల్ల, యజమానులు ఇళ్లను ఖాళీ చేయిస్తున్నారని, దీనికి బాధ్యత ఎవరు వహిస్తారని నిలదీశారు. ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులా?: హక్కుల కోసం గళమెత్తడం నేరమా? అని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులు, పోలీసు నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, ఇది కేవలం ప్రభుత్వ పతనానికి దారితీస్తుందని వారు హెచ్చరించారు. పోలీసు యంత్రాంగం ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలా మారి సామాన్య కార్మికులను వేధించడం ఆపకపోతే, రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. నిర్బంధాలతో భయపెట్టాలని చూస్తే తిరుగుబాటు తప్పదని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనిత, సబియా, భాగ్యలక్ష్మి, రేవతి, సోమలత, విజయలక్ష్మి, పుష్ప,తదితరులు పాల్గొన్నారు.



## కూకట్‌పల్లిలో ఘనంగా శ్రీ మహాలక్ష్మి యాగం -- భక్తులకు ఆహ్వానం

కూకట్ పల్లి; మార్చి 30(వాయిస్ టుడే): "ఓం నమో శ్రీ వెంకటేశాయ!" నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననున్నది. శ్రీ లక్ష్మీ అమ్మవారి తీరునక్షత్ర పుట్టినరోజు సందర్భంగా విశ్వ శ్రేయస్సు, లోకక్షేమం కోసం మహత్తరమైన శ్రీ మహాలక్ష్మి యాగంను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమం ఏప్రిల్ 1వ తేదీ (బుధవారం) సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు కూకట్‌పల్లి శ్రీ చిత్తారమ్మ దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో జరగనుంది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ వడ్డేపల్లి రాజేశ్వరరావు గారు, అలాగే శ్రీ మహాలక్ష్మి యాగం నిర్వహణ కమిటీ సభ్యులు ఈ రోజు నిర్వహించిన ప్రెస్ మీట్‌లో కార్యక్రమ వివరాలను వెల్లడించారు.

వారు మాట్లాడుతూ ఈ యాగం ద్వారా శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య అనుగ్రహం సమస్త ప్రజలకు కలగాలని ఆకాంక్షించారు. హిందూ బంధువులందరూ కుటుంబ సమేతంగా హాజరై ఈ మహా పుణ్యకార్యంలో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని కోరారు. కార్యక్రమానికి విచ్చేసే భక్తులకు వివిధ రకాల ప్రసాదాలు పంపిణీ చేయబడతాయని, అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా యాగానికి సంబంధించిన ఆకర్షణీయమైన పాంప్లెట్ (పోస్టర్) ను కూడా అధికారికంగా విడుదల చేశారు. భక్తులందరికీ ఇది అరుదైన ఆధ్యాత్మిక అవకాశమని, తప్పక పాల్గొని పుణ్యఫలాన్ని పొందాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.



## రామంతపూర్ భరత్ నగర్ శ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం ఆలయం నూతన కమిటీ

హైదరాబాద్: మార్చి 30 ( వాయిస్ టూ డే): రామంతపూర్ భరత్ నగర్ శ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం ఆలయం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భరత్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మన్న మరియు శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం ఆలయ కమిటీ అధ్యక్షులు ఎస్ రామిరెడ్డి అధ్యక్షతన ఆలయ నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షులుగాను ఎస్. రామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎ.చంద్రపాల్ జనరల్ సెక్రటరీగా రాపోలు శ్రీనివాస్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా రవికుమార్ జాయింట్ సెక్రటరీగా ఎం.రమేష్ కోశాధికారిగా సుధాకర్ రావు ను మరియు సలహాదారులుగా నాగిరెడ్డి, సత్యనారాయణ గౌడ్ ,జానయ్య గౌడ్, అరవింద స్వామి ను మరియు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ బాల్ రెడ్డి, సీతయ్య ,రాము యాదవ్, కిషోర్ ,,రవి, రామ్ ప్రసాద్ వెంకట రమణారావు, సిద్దయ్య గౌడ్ లను సభ్యులుగా ఎన్నుకోవడంఎ జరిగినది ఈ కమిటీ సభ్యులను ఎన్నుకోవడానికి సహకరించిన కాలనీవాసుల అందరికీ ప్రతి ఒక్కరికి దేవాలయం జనరల్ సెక్రెటరీ ఆర్ .శ్రీనివాస్ ధన్యవాదాలు తెలియజేశారు.



## బోరబండ రైల్వే స్టేషన్ సమస్యలపై కాంగ్రెస్ నేత బండి రమేష్ చురుకైన చర్యలు

కూకట్ పల్లి; మార్చి 30(వాయిస్ టుడే): సామాన్య ప్రజల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ బండి రమేష్ స్పష్టం చేశారు. ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకుని వెంటనే స్పందించడం తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. బోరబండ శివయ్య బస్తీలో పర్యటన నిన్న బోరబండ శివయ్య బస్తీలో పర్యటించిన బండి రమేష్ కు స్థానిక ప్రజలు తమ సమస్యలను విన్నవించారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్ పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు పెరగడం ఖాళీ ప్రదేశాల్లో చెత్త డంపింగ్ పెరగడం రాత్రివేళల్లో వీధిదీపాల కొరత ఈ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.వెంటనే అధికారులతో చర్చలు ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందించిన బండి రమేష్ రైల్వే ఉన్నతాధికారులతో మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. రైల్వే జీఎం తో సమావేశం సౌత్ సెంట్రల్ రైల్వే డివిజన్ జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ గారిని స్వయంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక సూచనలు చేశారు. రైల్వే స్టేషన్ పరిధిలోని ఖాళీ స్థలానికి ప్రహరీ గోడ నిర్మాణం భద్రత కోసం సెక్యూరిటీ ఏర్పాటు పరిసరాల్లో వీధి దీపాల ఏర్పాటు చెత్త డంపింగ్ తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టడం ఈ అంశాలపై రైల్వే జీఎం సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సుల పునరుద్ధరణపై విజ్ఞప్తి అదేవిధంగా, బండి రమేష్ ఆర్టీసీ అధికారులతో కూడా మాట్లాడి గతంలో బోరబండ రైల్వే స్టేషన్ వరకు నడిచిన బస్సులను ప్రస్తుతం నిలిపివేయడంతో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. మళ్లీ బస్సులను స్టేషన్ వరకు నడపాలని అధికారులను కోరారు. జల పక్షాన నిలిచే నాయకత్వం ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవడం ద్వారా బండి రమేష్ మరోసారి తన ప్రజానిబద్ధతను చాటుకున్నారు. బోరబండ ప్రాంతంలో త్వరలోనే మార్పులు కనిపిస్తాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు."ప్రజల సమస్యల పరిష్కారమే మా ప్రభుత్వ ధ్యేయం"



## శాసనమండలి నుంచి బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీలను బయటకి తీసుకువచ్చిన మార్షల్స్

కుత్బుల్లాపూర్ మార్చ్ 30(వాయిస్ టుడే): మార్షల్స్ కి బిఆర్ఎస్ సభ్యులకు మధ్య వాగ్వాదం. మీడియా పాయింట్ కు వెళ్తున్న ఎమ్మెల్సీలను అడ్డుకున్న మార్షల్స్. అసెంబ్లీ ప్రాంగణం నుంచి పోలీస్ వ్యాన్ లో బలవంతంగా ఎమ్మెల్సీలను ఎక్కించుకొని తెలంగాణ భవన్ తీసుకెల్తున్న పోలీసులు.




## నిజాంపేట్ సర్కిల్‌లో దోమల సమస్యపై ప్రజల నిరసన

### -- తక్షణ చర్యలు కోరుతూ డిమాండ్

కుత్బుల్లాపూర్ మార్చ్ 30(వాయిస్ టుడే): నిజాంపేట్ సర్కిల్ పరిధిలో అంబీర్ చెరువు, తుర్క చెరువు, పాపయ్య కుంట, బాచుపల్లి పెద్ద చెరువు, పత్తి కుంట, మేడికుంట ప్రాంతాల్లో గుర్రపు డెక్క (నీటి నిల్వ) అధికంగా ఉండటం వల్ల దోమల సమస్య తీవ్రంగా పెరిగిన నేపథ్యంలో, స్థానిక ప్రజలు ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ మాట్లాడుతూ, నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని చెరువుల్లో డ్రైనేజీ నీరు కలవడం వల్ల నీటి నిల్వలు పెరిగి దోమల పెరుగుదలకు కారణమవుతున్నాయని తెలిపారు. దీనివల్ల ప్రజలు రాత్రింబవళ్ళు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదంలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

అలాగే, ప్రజలకు మౌలిక వసతులు కల్పించాల్సిన అధికారులు పన్నుల వసూళ్లలో చూపుతున్న శ్రద్ధను, ప్రజా సమస్యల పరిష్కారంలో చూపకపోవడం బాధాకరమని విమర్శించారు.

ప్రధాన సమస్యలు: చెరువుల్లో డ్రైనేజీ నీరు కలవడం

గుర్రపు డెక్కపై కెమికల్ స్ప్రే చేయకపోవడం, వారానికి ఒకసారి కూడా ఫాగింగ్ నిర్వహించకపోవడం వల్ల సమస్య ఉత్పన్నమవుతున్నాను తక్షణమే సమస్య పరిష్కారానికి వారానికి కనీసం ఒకసారి దోమల నివారణ కోసం ఫాగింగ్ నిర్వహించాలి,చెరువుల్లో డ్రైనేజీ నీరు కలవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి, గుర్రపు డెక్కపై వెంటనే కెమికల్ స్ప్రే చేయాలి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకుని ప్రజలకు ఉపశమనం కల్పించాలని, లేనియెడల 15 రోజుల్లో మున్సిపల్ ఆఫీసు ముందు గుర్రపు డెక్క తో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, శ్రీనివాస్, ఎల్ల స్వామి, చంద్రశేఖర్, శ్రీనివాస్, పాండు, రంగనాయకులు, అంకం సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## మే 9వ తేదీన వేణుగోపాలపురం బస్తీ, వాజ్ పేయి నగర్ బస్తీ, ఇంద్రసింగ్ నగర్ బస్తీలకు సంబంధించిన హిందూ సమ్మేళనం

కుత్బుల్లాపూర్ మార్చ్ 30(వాయిస్ టుడే): ఈ మహత్తర కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం ప్రాంగణంలో ప్రత్యేక సమితి ఏర్పాటు చేయబడింది. ఈ సమితికి "హిందూ సమ్మేళన సంచాలన సమితి" అనే పేరు నిర్ణయించబడింది.

సమితి పదవులు:

అధ్యక్షుడు: గోపాలకృష్ణ

ఉపాధ్యక్షులు: నల్ల జై శంకర్, నాగదీప్ , ఠాకూర్ సింగ్ , నవీన్ కుమార్ పసుపులేటి , మధుసూదనాచార్యులు , పులి బలరాం వీరేశం ప్రధాన కార్యదర్శి: సామ్రాట్ కుమార్ బొల్లం సహాయ కార్యదర్శులు: ప్రియాంక , బాబినీలా , ఆంజనేయులు పుప్పల , ప్రవీణ్ వెలిశాల

కోశాధికారులు: భాస్కర్ , నర్సింగ్

ఆర్గనైజింగ్ సెక్రటరీలు: రాకేష్ , నరసింహ, వెంకట్

మే 9వ తేదీన వేణుగోపాల టెంపుల్ గ్రౌండ్‌లో ఈ హిందూ సమ్మేళనం అత్యంత వైభవంగా నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమం మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుంది. ప్రతి హిందూ కుటుంబం ఈ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొని, ఐక్యతను చాటుతూ, సమాజ బలాన్ని పెంచాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాము. మన ఐక్యతే మన బలం -- మన సంస్కృతిని కాపాడడం మన బాధ్యత. ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయడానికి అందరూ కలిసి ముందుకు రావాలని హిందూ సమ్మేళన సంచాలన సమితి సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలకు రండి

నాచారం (వాయిస్ టుడే): శాంతినగర్ చౌరస్తాలో ఏప్రిల్ 5న నిర్వహించతలపెట్టిన దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్. బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు 'సమతా దివస్' రావాలనీ కోరుతూ సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి. పద్మారావుగౌడ్ను ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం ఉత్సవ కమిటీ నాయకులు ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎమ్మార్పిఎస్ అధినేత మంద కృష్ణమాదిగను కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. ఈ క్యాక్రమంలో ఉత్సవ కమిటీ నాయకులు ముత్యాల గీతా దయాకర్, కుమార్ షాను, లక్ష్మీఆనంద్, కరుణాకర్, అనురుధ్, సతీష్, సాండీ తదితరులున్నారు.



## మీనవోలులో మాస్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం



ఖమ్మం, మార్చి 30 ( వాయిస్ టుడే ): జిల్లాలోని మధిర నియోజకవర్గం పరిధిలో గల ఎర్రుపాలెం మండలంలోని మీనవోలు గ్రామంలో ఏప్రిల్ 5 నుంచి స్థానిక పిల్లిబోస్ గ్రౌండ్ లో ముస్లి ఐక్య సంఘం ఆధ్వర్యంలో అంతర్ రాష్ట్రీయ మెగా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో ముస్లి ఐక్య సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా షేక్. ముజాహిద్ ఇషాతీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్. హుస్సేన్ సాహెబ్ తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి క్రికెట్ క్రీడాకారులకు, క్రీడా అభిమానులకు ఈ టోర్నమెంట్ లో హాజరు కావాలని కోరారు. ఈ టోర్నమెంట్ లో ప్రాతినిధ్యం వహించేందుకు గాను ఎంట్రీలు పంపవలసిన ఆఖరి తేదీ ఏప్రిల్ 3 కాగా అదే రోజు సాయంత్రం 6 గంటల లోపు ఎంట్రీ ఫీజు రూ. 1000 చెల్లించి నమోదు చేసుకోవాలని వారు సూచించారు. టోర్నమెంట్ లో విజేతలకు మొదటి బహుమానంగా రూ.75 వేలు, రన్నరప్ కు రూ.50 వేలు ఇవ్వడంతో పాటు సెమీ ఫైనల్ కు చేరుకునే ప్రతీ జట్టుకు రూ.10వేలు బహుమతిగా అందజేయడం జరుగుతుందని వెల్లడించారు. ఆత్మ కమిటీ డైరెక్టర్ (మీనవోలు) స్థల దాత పిల్లిబోస్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు ప్రకటిస్తూ.. రిజిస్ట్రేషన్ సమయంలో పూర్తి నిబంధనల గురించి వివరిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్: 991294641, 9063531748, 9010828776, 7995945346 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.



## పౌర హక్కులపై అవగాహన అవసరం

**- సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి**

**కులం పేరుతో దూషించడం, వివక్ష చూపడం చట్టరీత్యా నేరం**

**ఎంపీడీవో విజయ్ కుమార్**

చిగురుమామిడి, మార్చి 30 (వాయిస్ టుడే): సమాజంలో ప్రతి ఒక్కరూ పౌర హక్కులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, గ్రామ ప్రజలు పరస్పరం ఐక్యతతో జీవించాలనే సంకల్పంతో ముందుకు సాగాలని లంబాడిపల్లె గ్రామ సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లంబాడిపల్లె గ్రామంలో రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దళిత కాలనీలో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి, ఎంపీడీవో విజయ్ కుమార్, ఆర్ఐ తారా దేవి తదితర అధికారులు హాజరై ప్రసంగించారు. కులం పేరుతో దూషించడం, వివక్ష చూపడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులను కల్పించిందని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కల్పించే చట్టాలపై అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరమని వివరించారు.

పౌర హక్కులకు భంగం కలిగించడం కూడా నేరమేనని, ఇతరుల హక్కుల్లో జోక్యం చేసుకోవద్దని ప్రజలకు సూచించారు. ప్రతి నెల చివరి రోజున గ్రామాల్లో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తూ, అంటరానితనం, కుల వివక్ష, దౌర్జన్యాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో తాగునీరు, రహదారులు, విద్యుత్ సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలు వంటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కులాంతర వివాహం చేసుకున్న గడ్డం మహేందర్ దంపతులకు సర్పంచ్ సంపత్ రెడ్డి 25 కిలోల బియ్యం సంచిని అందజేసి, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి కల్పించేందుకు సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నక్క ఓదెలు యాదవ్, వార్డు సభ్యులు మంద లక్ష్మణ్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు మంద కిష్టయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి పద్మావతి, జీపీఓ గడ్డం అంజయ్య, ఉపాధ్యాయులు ముద్రకోల మురళి, హాస్టల్ వార్డెన్ మధుసూదన్ రెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు పింగిలి సంపత్ రెడ్డి, అంబేద్కర్ సంఘం నాయకులు బొట్ల కొమురయ్య, మంద మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.





# బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

## ఎంపీ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్

న్యూఢిల్లీ, మార్చి 30: (వాయిస్ టుడే) : దేశంలో 60 శాతానికి పైగా జనాభా ఉన్న బీసీలకు న్యాయం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 80 ఏళ్లు పూర్తవుతున్నా కూడా బీసీ కులాలు అన్ని రంగాల్లో వెనుకబడిపోయాయని, దీనికి రాజకీయ వ్యవస్థనే ప్రధాన కారణమని విమర్శించారు. సోమవారం న్యూఢిల్లీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కామారెడ్డిలో బీసీలకు 56 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కటినీ అమలు చేయలేదని ఆయన ఆరోపించారు.

తెలంగాణలో అత్యధిక సంఖ్యలో ఉన్న మున్నూరుకాపు, యాదవ, కుర్మ, రజక కులాలకు మంత్రివర్గంలో తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం దురదృష్టకరమని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ఇచ్చిన హామీ కూడా నెరవేరలేదని విమర్శించారు. బీసీల సంక్షేమానికి ప్రతి సంవత్సరం ?20 వేల కోట్ల నిధులు కేటాయిస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పాలనలో బీసీల అభ్యున్నతికి విశేష కృషి జరిగిందని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ తాను పార్లమెంటులో ప్రవేశపెట్టిన ప్రైవేట్ బిల్లుకు కాంగ్రెస్, బీజేపీలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ విషయంలో రాష్ట్ర ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీ మరియు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, చట్టసభల్లో మహిళలతో పాటు బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల హక్కుల సాధన కోసం ఐకమత్యంతో ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి. హనుమంతరావు, బీజేపీ నాయకుడు ఉప్పు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రశ్నించే గొంతుకకు సంకెళ్లు వేస్తున్నారు : శ్రావణ కుమార్

ఖమ్మం మార్చ్ 30 ( వాయిస్ టుడే ): ఖమ్మం తపాలా ప్రధానకార్యాలయం నందు ఏలూరి శ్రీనివాస రావు, వై. సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ద్వివై వార్షిక మహాసభ లో ఎన్ ఎఫ్ పి ఈ రాష్ట్ర కార్యదర్శి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ కార్మికుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించక పోగా పనిభారాన్ని మోపుతూ, సంక్షేమ పథకాలు అమలుచేయకుండా మీనమెషాలు లెక్కబేడుతుందని ప్రశ్నించే గొంతులకు సంకెళ్లతో బంది స్తున్నారని పేర్కొన్నారు. సభను ప్రారంభిస్తూ గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం, రాష్ట్ర మాజీ అధ్యక్షులు లెనిన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం చిన్న ఉద్యోగులపై నిరంకుశంగా, నిర్దాక్ష న్యంగా వ్యవహారిస్తుంది ఉద్యోగులకు అనుకూలంగా ఉన్నత స్థాయి న్యాయస్థాన తీర్పులను అమలు చేయడం లేదు ఇది ఉద్యోగులను తీవ్ర నిరాషకు గురిచేస్తోందని అందుకే హక్కుల సాధించ బడాలంటే ఉద్యమాలు, పోరాటాలు అనివార్యమని పిలుపునిచ్చారు. ఇంకా ఈ సభలో రాష్ట్ర నాయకులు మహేందర్, మధుసూధన్ రావు, ఎస్ వి రావు, మాజీ నాయకులు రామశాస్త్రి, నాగేశ్వర్ రావు, గ్రామీణ తపాలా రాష్ట్ర కార్యదర్శి జయరాజు, ఖాజామోహినుద్దీన్, మోలాలి, రాజ్యాలక్ష్మి, సు బెదాబేగం, మాట్లాడి పనిగంటల కన్నా ఎక్కువ సమయం చేయడం జరుగుతుందని వాపోయారు. జిల్లా సూపరిండేశీట్ వి వీరభద్ర స్వామి, పోస్టుమాస్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తమపరిధిలో గల పరిష్కా రమయ్యే సమస్యలు తీర్చడానికి ఎప్పుడు మీకు మేము సిద్ధంగా వున్నామన్నారు.పోస్టుమెన్ సంఘానికి అధ్యక్షులు గా వై సత్యనారాయణ, కార్యదర్శి పెరుగు నాగేశ్వరరావు, క్లాస్ 3 యూనియన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు, కార్యదర్శి బందేల నాగరాజు కోశాధికారి బి రవీందర్ లను సభ ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

## ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు వెళతాం

### సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్



సిరిసిల్ల మార్చి 30 (వాయిస్ టుడే) ఆశ వర్కర్ల సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కి నిరసనగా నిర్బంధానికి వ్యతిరేకం గా ఆశ వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 18 వేల రూపాయల ఫిక్స్ వేతనం నిర్ణయించి అసెంబ్లీలో తీర్మానం చేయాలనే డిమాండ్ తో ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం రోజు రాజన్న సిరిసిల్ల జిల్లా లోని ఆశా వర్కర్లందరూ సిఐటియు ఆధ్వర్యంలో సిరిసిల్ల అంబేద్కర్ చౌక్ వద్ద రాస్తారోకో – ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మూషం రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేకుంటే నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి జయశీల, సిఐటియు జిల్లా నాయకులు సూరం పద్మ , బూర శ్రీనివాస్, ఐద్వా జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు భారతి, గాయత్రి, చంద్రకళ, జమున, లావణ్య, రజిత, రుక్మిణి, లత, భూలక్ష్మి , రేణుక, మమత, సునంద, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మిక తనిఖీ



ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (వాయిస్ టుడే); విద్యార్థులకు మెనూ కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన భోజనం ఇవ్వాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) విద్యాలయం లో కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, స్టోర్ రూమ్ లో ఆహార సామగ్రి, కోడి గుడ్లు, కూరగాయలు, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలు, తరగతి, వసతి గదులను పరిశీలించారు. మెనూ ప్రకారం చికెన్, మటన్, కోడి గుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవు తుండగా, కలెక్టర్ వారితో మాట్లాడి.. పలు సూచనలు చేశారు. విద్యార్థులందరూ చదువు పై శ్రద్ధ పెట్టాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. తాము అనుకున్న ఉద్యోగాలు, ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.

# సీఏపీఏఫ్ బిల్లు-2026తో భద్రతా వ్యవస్థ బలోపేతం

## ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



న్యూఢిల్లీ, మార్చి 30: వాయిస్ టుడే : కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు దేశ అంతర్గత భద్రతకు వెన్నుముక వంటివని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. రాజ్యసభలో సోమవారం "కేంద్ర సాయుధ పోలీస్ బలగాల సాధారణ పరిపాలన (సీఏపీఏఫ్) బిల్లు–2026"పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు.

CRPF, BSF, CISF, ITBP, SSB వంటి బలగాలు దేశ సరిహద్దుల రక్షణ, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనడం, చట్టవ్యవస్థ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు. అయితే, ఈ బలగాల పరిపాలనా వ్యవస్థ ఇప్పటివరకు విభిన్నంగా, కొంత సంక్లిష్టంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. వేర్వేరు నియమాలు, నిబంధనలు ఉండటం వల్ల అయోమయం, ఆలస్యం, పనితీరు లోపాలు చోటుచేసుకుంటున్నాయని అభిప్రాయపడ్డారు.

ఈ నేపథ్యంలో తీసుకువచ్చిన సీఏపీఏఫ్ బిల్లు చాలా కీలకమని, నియామకాలు, సేవా నిబంధనలు, బదిలీలు, పదోన్నతులు, క్రమశిక్షణ వంటి అంశాల్లో ఏకరీతి విధానం తీసుకురావడానికి ఇది దోహదపడుతుందని వివరించారు. దీని వల్ల సమన్వయం మెరుగుపడటమే కాకుండా, సిబ్బందిలో ఉత్సాహం పెరుగుతుందని, నిర్ణయాల ప్రక్రియ వేగవంతం అవుతుందని అన్నారు. అలాగే పారదర్శకత, బాధ్యత మరింత బలపడతాయని పేర్కొన్న ఆయన, అమలు సమయంలో జవాన్ల సంక్షేమం, మానసిక ఆరోగ్యం, కుటుంబ సహాయం, పని–జీవిత సమతౌల్యం, సరైన సెలవుల విధానం వంటి అంశాలను ప్రాధాన్యంగా పరిగణించాలన్నారు. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ బలంగా ఉండాలని, రాష్ట్రాలతో సమన్వయం పెంపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు.

ఈ సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పాలనలో భద్రతా వ్యవస్థ ఆధునీకరణకు తీసుకున్న చర్యలను ఆయన ప్రస్తావించారు. ఆధునిక వాహనాలు, ఆయుధాలు, సర్వైలెన్స్, ఇంటెలిజెన్స్ వ్యవస్థల ద్వారా నక్సలిజం సమస్యను సమర్థవంతంగా నియంత్రించగలిగినట్లు వివరించారు. సరైన మార్పులతో ఈ బిల్లు అమలు అయితే దేశ భద్రత మరింత బలోపేతం అవుతుందని, జవాన్ల మనోబలం పెరుగుతుందని తెలిపారు. "దేశాన్ని కాపాడే వారికి కేవలం మాటలతో కాకుండా, సమర్థవంతమైన విధానాలతో మద్దతు ఇవ్వాలి" అని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు.

# జనగణన కార్యక్రమం సమర్ధవంతంగా నిర్వహించాలి

## :- డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోళీకేరి




యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో... (వాయిస్ టుడే ప్రతినిధి ):- జనగణన-2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలని డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోళీకేరి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా జనగణన అధికారులతో జనగణన, ఇండ్ల గణన ప్రక్రియలు, మ్యాప్ తయారీ, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ, సాంకేతికత వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గణన చేయాలని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా జనగణనను పూర్తిగా డిజిటల్ పద్ధతి ద్వారా చేపట్టడం జరుగుతుందని, మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు జనగణనలో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమం కొనసాగుతుందని, కుటుంబాల వివరాలు పూర్తిగా నమోదు చేయబడతాయని, సన్నాహక పనులు మొదలు పెట్టాలని తెలిపారు. యాప్ నిర్వహణలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించి ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. చార్జెస్ (మండలాల) వారీగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం చేపట్టాలని, 300 ఇళ్లకు / 750-800 జనాభాకు ఒక ఎన్యుమరేటర్ ను నియమించాలని, ఎన్యుమరేటర్ బ్లాక్/ హౌస్ లిస్టింగ్ బ్లాక్ తయారు చేయాలని, క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో జనగణన-2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన విధులు అధికారులు, సిబ్బంది సమన్వయంతో సక్రమంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా మొదటి విడత ఇండ్ల గణన ప్రక్రియను పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి జయమ్మ, ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా జనగణన అధికారి వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం

### - యాదాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. (వాయిస్ టుడే ప్రతినిధి) :- మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా సన్నాహక సమావేశం జరిగింది. ముందుగా వివిధ సంఘాల నాయకుల ద్వారా వారి తెలియజేసిన సలహాలు, సూచనలను స్వీకరించారు. ఈ సమావేశానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. ఏప్రిల్ మాసంలో మహనీయుల జయంతి ఉత్సవాలను ఒక పండుగ వాతావరణంలో జిల్లాలో ఏప్రిల్ 5 న బాబు జగ్ జీవన్ రామ్ జయంతి ,ఏప్రిల్ -11న జ్యోతిబా పూలే , మరియు ఏప్రిల్ -14 డా,,బి. ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పెద్ద ఎత్తున వివిధ శాఖల సహకారంతో అనేక కార్యక్రమాలు నిర్వహించేందుకు అందరి సహకారంతో సామరస్యంగా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మహనీయుల జయంతి ఉత్సవాలకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు. అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, పారిశుధ్య చర్యలు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కుల బేధం లేకుండా అన్ని కులాల నాయకులు ఈ ఉత్సవాల్లో పాల్గొని విజయంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి సాహితీ, భువనగిరి డీఎస్పీ రవీందర్,ట్రాఫిక్ డీఎస్పీ ప్రభాకర్ రెడ్డి,ఈ.డి ఎస్సీ కార్పొరేషన్ శ్యాం సుందర్, వివిధ సంఘాల నాయకులు , ఎస్సీ సంక్షేమ శాఖ సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.?



## సమస్యలు ఆలకించి తక్షణ పరిష్కారానికి ఆదేశాలు

### ప్రజావాణి పిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా

### ప్రజావాణి ఫిర్యాదులు 225

కరీంనగర్,మార్చి30(వాయిస్ టుడే):ప్రజావాణి అర్జీలపై విచారణ జరిపిసమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు.ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించవద్దని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తారని, ఫిర్యాదులపై ఆయా శాఖల అధికారులు సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీలను పెండింగ్లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో 225 ఫిర్యాదులు వినతులు వచ్చాయి. సంబంధిత అధికారులు పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వృద్ధుల వద్దకే స్వయంగా జిల్లా కలెక్టర్ వెళ్లి వినతి పత్రాలను స్వీకరించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. సమస్యలను ఆలకించి తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే,లక్ష్మి కిరణ్,ఆర్డీవో కే మహేశ్వర్,డిఆర్డిఓ శ్రీధర్, గృహ నిర్మాణశాఖ పిడి శ్రీనివాసులు,అధికారులు పాల్గొన్నారు.

## బంగారు మైసమ్మ, రేణుక ఎల్లమ్మ దేవాలయల పునర్నిర్మాణానికి భూమి పూజ

### - భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో...( వాయిస్ టుడే ప్రతినిధి ) :- బంగారు మైసమ్మ, రేణుక ఎల్లమ్మ దేవాలయల పునర్నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.ఈ భూమి పూజ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్,మార్కెట్ కమిటీ చైర్మన్ కనుకుంట్ల రేఖబాబురావులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు.భువనగిరి మున్సిపల్ పట్టణంలోని రైతు బజార్ లో పునర్నిర్మాణం చేపట్టనున్న రే ణుక ఎల్లమ్మ, బంగారు మైసమ్మ దేవాలయల నిర్మాణానికి సోమవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ కనుకుంట్ల రేఖా బాబురావు మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాల ఏర్పాటుతో పాటు, మన పూర్వీకుల ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా దేవాలయాల అభివృద్ధి, నూతన ఆలయాల నిర్మాణానికి కృషి చేస్తు న్నదని అన్నారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అందిస్తున్న సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బస్వాపురం ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుండి సాగునీరు రాగానే భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కాలువ అభివృద్ధి పనులు పూర్తి చేసి రైతులకు దీర్ఘకాల ప్రయోజనాలు కల్పించారన్నారు. గత ప్రభుత్వం బస్వాపురం ప్రాజెక్టు నుండి కింద భాగానికి పోవు కాలువ పనులు దశాబ్దకాలంగా ప్రారంభించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాకే ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో కాలువలకు మోక్షం లభించిందని, భువనగిరి, వలిగొండ, రైతులకు సకాలంలో నీళ్ళు అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తాడూరి నరసింహ,రంగ క్రిస్టయ్య,చిన్నం శ్రీను,రైతు బజార్ సంఘం అధ్యక్షులు యట్టా నాగరాజు,ఎస్టేట్ అఫీసిసర్ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.




## పట్టణంలో బేకరి సీజ్

కరీంనగర్, మార్చి30 (వాయిస్ టుడే): నగరంలోని రేకుర్తి ప్రాంతంలో ఉన్న గణేష్ బెంగళూరు బేకరీ నుండి ఆర్డర్ చేసిన ఎగ్ పఫ్ నుండి దుర్వాసన వస్తోందని ఫుడ్ సేఫ్టీ కార్యాలయానికి ఫిర్యాదు అందింది.ఫిర్యాదు ఆధారంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు.తనిఖీ సమయంలో క్రింది విషయాలు గుర్తించబడ్డాయి. కేకులు మరియు ఎగ్ పఫ్ తయారీలో పాడైన మరియు పగిలిన గుడ్లు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు.వంటగది ప్రాంతం పూర్తిగా అశుభ్రంగా ఉంది. మైదా మరియు క్రీమ్ లో పురుగులు కనిపించాయి.ఫ్రీజర్లో నిల్వ చేసిన షుగర్ సిరప్ మరియు క్రీమ్ లో కూడా పురుగులు ఉన్నట్లు గుర్తించారు.నిల్వ ప్రాంతంలో 14 ట్రేలు పగిలిన గుడ్లు గుర్తించబడ్డాయి.ఈ పగిలిన గుడ్ల కారణంగా వంటగది ప్రాంతం మొత్తం ఈగలతో నిండిపోయింది. పగిలిన గుడ్లతో తయారు చేసిన సుమారు రూ.7000 విలువైన కేకులు బేకరీలో ఉన్నట్లు గుర్తించారు.పాడైన గుడ్లు మరియు కేకులను అక్కడికక్కడే తొలగించి పారవేశారు.మొత్తం సుమారు రూ.9000 విలువైన నిల్వ ను నాశనం చేశారు.బేకరీ యొక్క ఫఫ్సి లైసెన్స్ను తాత్కాలికంగా నిలిపివేశారు.అవసరమైన సరిదిద్దే చర్యలు తీసుకునే వరకు బేకరీ నిర్వహణకు అనుమతి లేదు.అలాగే ఫుడ్ సేఫ్టీ నిబంధనల ఉల్లంఘన కారణంగా ఫుడ్ సేఫ్టీ చట్టం, 2006 ప్రకారం అడ్జుడికేషన్ చర్యలు ప్రారంభించబడుతున్నాయి.



## పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడి యత్నం..

## చలో హైదరాబాద్ ముందస్తు అరెస్టు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో మార్చి 30 వాయిస్ టుడే పిట్లం: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్లు తమకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు బయలుదేరిన మాజీ సర్పంచ్లను పిట్లం పోలీసులు ముందస్తుగా అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, బి.రమేష్, నారాయణరెడ్డి పాల్గొన్నారు. పెండింగ్ బిల్లుల సమస్య పరిష్కారం కాకపోవడంతోనే నిరసనకు దిగినట్లు వారు తెలిపారు.



## ప్రజావాణికి 205 దరఖాస్తులు

### స్వీకరించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

### పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు

రాజన్న సిరిసిల్ల, మార్చి 30, వాయిస్ టుడే: జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో సోమవారం ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించి పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.. మొత్తం 205 అర్జీలు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేశారు. రెవెన్యూ శాఖకు 82, గృహ నిర్మాణ శాఖకు 35, డీఆర్డీఓకు -- 30, జిల్లా పంచాయతీ కార్యాలయానికి 9, ఉపాధి కల్పన అధికారికి -8, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎస్పీ కార్యాలయానికి ఐదు చొప్పున, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా సంక్షేమ అధికారి -- 4, జిల్లా పౌర సరఫరాల శాఖ, జిల్లా వైద్యాధికారి, నీటి పారుదల శాఖ అధికారికి మూడు చొప్పున, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్, డీఎం ఆర్టీసీ సిరిసిల్ల, సెస్ ఎండీకి రెండు చొప్పున, చేనేత అండ్ జౌళి శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, బీసీ సంక్షేమ అధికారి, జిల్లా విద్యాధికారి, అటవీ శాఖాధికారి, మైనింగ్ అధికారి, జిల్లా ఎక్సైజు అధికారి, యువజన అండ్ స్పోర్ట్స్ అధికారి, ఈడీఎం, జీజీహెచ్ సిరిసిల్ల, సబ్ రిజిస్ట్రార్ సిరిసిల్ల, మెప్మా కార్యాలయానికి ఒకటి చొప్పున రాగా.. వాటిని సంబంధిత కార్యాలయాలకు పంపించారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.



## యుద్ధ ప్రాతిపదికన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి: ఎంపీడీవో విజయ్ కుమార్

చిగురుమామిడి, మార్చి 30 (వాయిస్ టుడే): అర్హులైన పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎంపీడీవో విజయ్ కుమార్ లబ్ధిదారులకు సూచించారు. సోమవారం లంబాడిపల్లె గ్రామంలో సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి, ఉపసర్పంచ్ నక్క ఓదెలు యాదవ్‌తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలు చామంతుల లచ్చవ్వ నిర్మిస్తున్న ఇంటిని సందర్శించి పనితీరును ప్రశంసించారు. లంబాడిపల్లె గ్రామానికి మొత్తం 8 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు పేర్కొన్న ఎంపీడీవో, గృహ నిర్మాణాలతో పాటు మరుగుదొడ్ల నిర్మాణాలను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తున్నామని, ఎలాంటి సమస్యలు ఎదురైనా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు త్వరలోనే చేపట్టబడుతుందని, లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పింగిలి సంపత్ రెడ్డి, మంద కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు

### రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

### జిల్లాలోని కేజీబీవీలు, టీజీఎంఎస్ రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్లకు 20 ఫ్రీజర్ల పంపిణీ

రాజన్న సిరిసిల్ల, మార్చి 30, (వాయిస్ టుడే): విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లాలోని జిల్లాలోని 13 కేజీబీవీలు, ఏడు టీజీఎంఎస్ హాస్టళ్లకు కలిపి 20 ఫ్రీజర్లు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక చొరవతో సమకూర్చారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ఆయా విద్యాలయాల బాధ్యులకు కలెక్టర్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తుందని వివరించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా జిల్లాలోని విద్యాలయాల విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యం లో ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు, సేవలు అందిస్తుందని తెలిపారు. జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్లకు గత చలి కాలంలో విద్యార్థులకు వేడి నీళ్లు అందించేందుకు ఇప్పటికే గీజర్లు అందించామని గుర్తు చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహార పదార్థాలను అందించేందుకు ఫ్రీజర్లు ఈరోజు ఆయా రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్ల బాధ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఈ ఫ్రీజర్ల ద్వారా విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు, కూరగాయలు పాడైపోకుండా నిల్వ చేసుకోవచ్చనీ, పాలు, ఆకు కూరలు, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలు స్వచ్ఛంగా అందించే అవకాశం ఉందని తెలిపారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో శుభ్రమైన ఆహారం పదార్థాలు అందించడం, వ్యర్థాల నిర్వహణ, వసతి గృహాలలో మెరుగైన జీవన వాతావరణం కల్పించడానికి ఇన్సినరేటర్, వంటపాత్రలు కూడా గతంలో అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జీసీడీవో పద్మజ, స్పెషల్ ఆఫీసర్స్, కేర్ టేకర్స్ తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడి స్కూల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి: ఆర్డీఓ మహేశ్వర్

కరీంనగర్,మార్చి 30(వాయిస్ టుడే): అంగన్వాడీ స్కూల్ లలో అందే సేవలను వినియోగించుకోవాలని కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మహేశ్వర్ సూచించారు. ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా కోతిరాంపూర్ అంగన్వాడీ సెంటర్లో ప్రీ స్కూల్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఆర్డీవో మహేశ్వర్ జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి,సిడిపిఓ సబితా,39 డివిజన్ కార్పొరేటర్ లుమాసం గణేష్,కార్పొరేటర్ పాడిశెట్టి వసంతలక్ష్మి భూమయ్య లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మహేశ్వర్ మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్కు దీటుగా అంగన్వాడీ స్కూల్ లు గొప్పగా పనిచేస్తున్నాయని,ఆట పాటలతో విద్యను బోధించడం జరుగుతుందని చెప్పారు. డిడబ్ల్యుఓ సరస్వతి మాట్లాడుతూ గర్భవతులు,బాలింతలు అంగన్వాడీ సెంటర్ లో లభించే పౌష్టికహార బాలామృతం తీసుకోవాలని సూచించారు. సీడీపీఓ సబిత మాట్లాడుతూ ప్రీ స్కూల్ ప్రాధాన్యత,మొదటి 1000 రోజులలో తీసుకోవాల్సిన జాగ్రత్త,పోషకహారం గురుంచి తల్లులకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. పి జి ప్రతం మాస్టర్ ట్రయినర్ రాజేందర్ పిల్లలకు ఐదు అభివృద్ధిల పైన ఆటలు ఆడించారు. 200 మంది పిల్లలు ఆటలు, పాటలు, కథ, సంభాషణ, పూర్వ గణిత భావనలు తల్లి తండ్రులను మంత్ర ముగ్ధులను చేశాయి. భాష,మేధా, సాంఘిక అభివృద్ధి, సృజనత్మాకత గురించి పిల్లలకు వివరిస్తూ వారికీ రిపోర్ట్ కార్డు సీడీపీఓ సబిత సూపెర్వైసోర్ అరుణ నిర్మల రేణుక చేతుల మీద అందించారు. ప్రీస్కూల్ వస్తువుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది ఈ కార్యక్రమంలో బి సి సతీష్ ,టీచర్స్ స్వరూప శ్యామల, సరిత, పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చిన్నకొడపగల్ శివారులో రోడ్డు ప్రమాదం.. బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో మార్చి 30 (వాయిస్ టుడే) పిట్లం: ధర్మారం గ్రామానికి చెందిన జాదవ్ రాజు (28) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన పిట్లం మండల పరిధిలో చోటుచేసుకుంది. మృతుడు హరి సింగ్ కుమారుడు కాగా, లంబాడా కులానికి చెందినవాడు. వృత్తిరీత్యా డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజు నిన్న (29-03-2026) తన తుఫాన్ వాహనం ఫైనాన్స్ కట్టేందుకు బైక్‌పై పిట్లం వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో, చిన్నకొడపగల్ గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న పొలాల్లో పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రాజు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనపై మృతుని తండ్రి జాదవ్ హరి సింగ్ ఫిర్యాదు మేరకు పిట్లం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సబ్ ఇన్స్పెక్టర్ వెంకట్రావు తెలిపారు. మృతుడికి వివాహమైందని, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.




## అత్యవసర ప్రాణరక్షణపై అవగాహన కార్యక్రమం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో మార్చి 30 (వాయిస్ టుడే) కామారెడ్డి: జిల్లా పోలీస్ అధికారి శ్రీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు, కామారెడ్డి అదనపు పోలీస్ అధికారి శ్రీమతి చైతన్య రెడ్డి ఐపీఎస్ ఆధ్వర్యంలో ఆరైవ్-అలైవ్ కార్యక్రమాన్ని గెలాక్సీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు తక్షణ ప్రథమ చికిత్స అందించి ప్రాణాలు కాపాడే విధానంపై వైద్యుల బృందం ప్రజలకు అవగాహన కల్పించింది. అత్యవసర సమయంలో వెంటనే 108కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, కానిస్టేబుళ్లు ప్రభాకర్, సాయిలు మాటలు, పాటల ద్వారా సందేశం అందించారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు రామన్, సంపత్, దేవునిపల్లి ఉప పరిశీలకుడు రంజిత్‌తో పాటు వివిధ పోలీస్ కేంద్రాల ఉప పరిశీలకులు పాల్గొన్నారు. ధాబా యజమానులు, ఆటో డ్రైవర్లు, ఇతర ప్రజలు హాజరయ్యారు.



## మా దారి మానేరు మమ్మల్ని ఎవరూ ఆపలేరు

**అడ్డు అదుపు లేని ఇసుక మాఫియా ఆగడాలు**



కరీంనగర్,మార్చి 30(వాయిస్ టుడే): పట్టణానికి కూత వేటు దూరంలో నిత్యం వేలాది మంది అధికారులు, ప్రజాప్రతినిధులు సంచరిస్తున్న కరీంనగర్ బైపాస్ రహదారి, హైదరాబాద్,వరంగల్ ప్రధాన రహదారి ప్రక్కనే ఉన్న మానేర్ నది పరివాహక ప్రాంతంలో ఇసుక మాఫియా యదేచ్ఛగా తవ్వకాలు చేపడుతూ నిత్యం వందలాది ట్రాక్టర్లు ఇసుక తరలిస్తున్న అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ కనీసం అడ్డు చెప్పకపోవడం విస్మయాన్ని కలిగిస్తుంది. అసెంబ్లీ సమావేశాల్లో స్వయాన ముఖ్యమంత్రే రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణా,గ్రానైట్ తవ్వకాలపై సీబీ సీఐడీ విచారణకు ఆదేశించిన కూడా అధికారుల్లో ఎలాంటి చలనం లేకపోవడం చూస్తుంటే ఇసుక మాఫియా ఆగడాలు ఎంతలా ఉన్నాయో చూడవచ్చు. కరీంనగర్ జిల్లాలో ముఖ్యంగా కొత్తపల్లి,మానుకోండూర్, తిమ్మాపూర్ మండలాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. నిత్యం వేలాది ట్రాక్టర్లతో నగరానికి ఇసుక తరలిస్తున్న అధికారులు, పోలీసులు తూతూ మంత్రంగా తనిఖీలు చేపడుతూ పరోక్షంగా ఇసుక అక్రమ రవాణాకు సహకారాలు అందిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పిర్యాదు అందినప్పుడు మాత్రం ఒకటి రెండు ట్రాక్టర్లు పట్టుకుని కేసులు నమోదు చేస్తూ ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోతున్నామని ప్రకటనలు ఇవ్వడంతో అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# కాంట్రవర్సీ కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యే సభ్యత్వం రద్దు చేయాలి

**ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇచ్చారు**

**కాంగ్రెస్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి**

**డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్**



కరీంనగర్,మార్చి 30(వాయిస్ టుడే): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అసెంబ్లీలో ప్రవర్తించిన తీరు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఉందని జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి సిరాజు హుస్సేన్ మండిపడ్డారు. సీనియర్ ఎమ్మెల్యే అయిన కడియం శ్రీహరి పట్ల కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరు దారుణంగా ఉందని కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యే సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరును నిరసిస్తూ సిరాజు హుస్సేన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి వ్యక్తులు శాసనసభలో ఉండడం ప్రమాదకరమని వెంటనే ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని తిరిగి ఎన్నికల్లో పోటీ చేయకుండా ఒక చట్టం తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలను చర్చించే పవిత్ర వేదిక అయిన అసెంబ్లీలో బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన స్థానంలో ఉండి, ప్రజా ప్రతినిధిగా ప్రవర్తన సరిగా లేకపోవడం బాధాకరమన్నారు. సీనియర్ నేతగా సీనియర్ ఎమ్మెల్యేగా పలుమార్లు మంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి పట్ల హవ భావాలు చేస్తూ కించపరచడం సరైనది కాదన్నారు. ఆయనకు వెంటనే బేషరతుగా కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిసారి కాంట్రవర్సీ చేయడం కౌశిక్ రెడ్డికి అలవాటుగా మారిందని పత్రికల్లో హైలెట్ కావడం రివాజ్ గా మారిందన్నారు. గతంలో గవర్నర్గా పనిచేసిన తమిళసై పట్ల చులకనగా మాట్లాడడం ఎవరిని లెక్క చేయకపోవడం ఇటీవల సిపి గౌష్ ఆలంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం దారుణం అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి నాయకుడు నైతిక విలువలను పాటిస్తూ,ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. కానీ ఇటువంటి ఘటనలు ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసేలా ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని, ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా చర్చించాలనే బాధ్యతను గుర్తుంచుకోవాలని కౌశిక్ రెడ్డికి సూచించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కౌశిక్ రెడ్డి వ్యవహారాన్ని రాష్ట్రమంతా వ్యతిరేకిస్తున్నారని ప్రజలంతా తగిన గుణపాఠం చెబుతారని సిరాజు హుస్సేన్ పేర్కొన్నారు.




## బ్లూ బెల్స్ హై స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

కరీంనగర్, మార్చి30(వాయిస్ టుడే): నగరంలోని స్థానిక హనుమాన్ నగర్‌లో బ్లూ బెల్స్ హై స్కూల్ యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ నృత్యాలు, పాటలు మరియు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా జంగా సునీత, కరెస్పాండెంట్ మనోహర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జంగా సునీత మనోహర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది ఈ ప్రాథమిక దశలోనే ఏర్పడుతుందని తెలిపారు. పిల్లల సమగ్ర అభివృద్ధిలో తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రుల సమక్షంలో ఈ వేడుకలు ఆనందోత్సాహాలతో కొనసాగాయి. కార్యక్రమం ముగింపులో విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు.



## ఎమ్మెల్సీగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కలిసి 500 కోట్ల రూపాయలు సంపాదించుకున్న జీవన్ రెడ్డి

**కాంగ్రెస్ పార్టీని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదు**

**ఉద్దేశపూర్వకంగానే ఒక మీడియా ఛానల్ ద్వారా నాపై దుష్ప్రచారం**

**టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం**

కరీంనగర్,మార్చి 30(వాయిస్ టుడే): కాంగ్రెస్ మాజీ నాయకుడు జీవన్ రెడ్డి వల్ల పార్టీకి ఎలాంటి లాభం లేదని, పార్టీ గుర్తింపుతో జీవన్ రెడ్డి 40 వంవత్సరాలు పబ్బం గడిపారని, అలాంటి వ్యక్తి పార్టీని,పార్టీ నాయకవతాన్ని విమర్శించే స్థాయి లేదని టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జలకాంతం విమర్శించారు. నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో కాంగ్రెస్ నాయకులు సముద్రాల అజయ్ గడ్డం నాగరాజుతో కలిసి ఆయన పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన జగిత్యాల మాజీ ఎమ్మెల్యే,మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల పట్ల తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డిని 40 సంవత్సరాల నుండి కడుపులో పెట్టుకొని చూసుకుంటే కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసింది శూన్యం. జగిత్యాలలో పార్టీ శ్రేణులకు కోసం నీవు ఏమి చేశావో చెప్పు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో నీవు ఎంత మందిని గెలిపించావు చెప్పు. నీ సొంత పనులు చేసుకున్నావు,నీ కుటుంబ సభ్యులకు పని చేశావు. జగిత్యాల ప్రజలకు నువ్వు చేసింది సున్నా కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎదిగిన నీవు బిసి,ఎస్సి, మైనారిటీలకు అగ్ర కులాల పేద బిడ్డలకు ఏమి న్యాయం చేశావు. మా సీఎం రేవంత్ రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నావు. నీకు ఇది న్యాయమా. కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎదిగిన నీవు కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం నీవు ఏం త్యాగం చేశావో చెప్పాలి. ఎమ్మెల్సీగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తో చేతులు కలిపి కాంగ్రెస్ పార్టీని మోసం చేసి 500 కోట్ల రూపాయలు సంపాదించుకున్నావు. ఖబడ్దార్ జీవన్ రెడ్డి ఇంకోసారి సీఎం రేవంత్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకునేలేదని హెచ్చరించారు.




## లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఏడాది కాలంగా నిరంతర అన్నదానం

కరీంనగర్, మార్చి 30(వాయిస్ టుడే): మానవ సేవయే మాధవ సేవగా భావించి, లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గత ఏడాది కాలంగా నగరంలో నిరంతరాయంగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం నేటితో 365 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నగరంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మరియు రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి యాదగిరి సునీల్ రావు,మరియు 66వ డివిజన్ కార్పొరేటర్ వంగల పవన్ ముఖ్య అతిథులుగా హాజరై,అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ మ్యడం శివకాంత్,ప్రెసిడెంట్ ముక్క శరత్ కృష్ణ,బట్టు వినోద్ మరియు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 36 ఫిర్యాదులు స్వీకరణ : జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**



సిరిసిల్ల, మార్చి 30 (వాయిస్ టుడే) ప్రజల వద్ద నుండి ఫిర్యాదు లు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం లో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 36 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారుల తో మర్యాద పూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదు దారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షిం చుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగపరుస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి: దొగ్గలి శ్రీధర్



కరీంనగర్,మార్చి 30(వాయిస్ టుడే): సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగపరుస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్టీఐ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దొగ్గలి శ్రీధర్ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. సమాజంలో అవినీతి అక్రమాలు జరిగితే వాటిని నిర్మూలించడానికి అవినీతిని అరికట్టడానికి అవినీతి చేసిన వారిని బహిరంగపరచడానికి సమాచార హక్కు చట్టాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తే దీనిని కొంతమంది ఉపయోగించుకొని బ్లాక్ మెయిల్ చేసుకుంటూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. ఇలాంటి వారిపై జిల్లా కలెక్టర్ జిల్లా పోలీస్ కమిషనర్ దృష్టి పెట్టాలని కోరుతున్నాం. కొంతమంది కుల సంఘాల నాయకులు,విద్యార్థి సంఘం నాయకులమని చెప్పుకునేవారు విద్యాసంస్థలను టార్గెట్ చేసుకొని వారిని సమాచార హక్కు చట్టం రూపాన ఇబ్బందులకు గురిచేస్తూ లక్షలాది రూపాయలు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి వాటిని అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి సమాజంలో అవినీతి జరిగినప్పుడు వాటిని సమాచార హక్కు చట్టం రూపంలో సేకరించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి వారిపై చర్యలు తీసుకునే విధంగా ప్రయత్నం చేయాలి కానీ దీనిని అడ్డుపెట్టుకొని యాజమాన్యాలను బెదిరిస్తూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు ఇదే వ్యాపారంగా చేసుకుంటూ కొంతమంది జీవిస్తున్నారు. ఇలాంటి వారిపై జిల్లా అధికారులు దృష్టి పెట్టాలని కోరుతున్నాం అన్నారు.



## 14 యేండ్లు నిండిన వారికి టీబీ పరీక్షలు నిర్వహించాలి

కరీంనగర్, మార్చి30 (వాయిస్ టుడే): టీబిముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర టీబీ నిర్మూలన డివిజన్ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుండి అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే,జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, టీబి నియంత్రణ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి హాజరయ్యారు. వందరోజుల టీబి పరీక్షల నిర్వహణలో దేశవ్యాప్తంగా గుర్తించిన గ్రామాల్లో టీబి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఈనెల 24 నుండి 100 రోజుల కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లాలో గుర్తించిన 49 గ్రామాల్లో 14 సంవత్సరాల పైబడిన వారందరికీ టీబీ పరీక్షలు నిర్వహించాల్సిందిగా కేంద్ర విభాగం ఆదేశించింది. క్షయ వ్యాధి అనుమానం ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని, అన్ని రకాల ఖరీదైన మందులు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందజేస్తారని జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి తెలిపారు.

# మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

బిఆర్ఎస్ పార్టీ హయాంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

భయపడేది లేదు..
ప్రతి కార్యకర్తకు పార్టీ అండ

మున్సిపల్ కార్పొరేషన్ పై
గులాబీ జెండా ఎగరడం ఖాయం

కార్యకర్తల సమావేశంలో
మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్



హనుమకొండ,వాయిస్ టుడే: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ పనీ చేయలేదని, మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసిందని వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ విమర్శించారు. సోమవారం వర్ధన్నపేట నియోజకవర్గం గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని పుష్పరాజ్ ఫంక్షన్ హాల్ లో 14వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ విస్తృత సాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన జరుగుతుందని,ప్రజాస్వామ్యం కూని అవుతుందని అన్నారు. నియోజకవర్గంలోని 14వ డివిజన్ పరిధిలోని కాలనీల్లో గతంలోని బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఎనుమాముల, కారల్ మార్క్స్ నగర్ కాలనీ,ె ండ్డిపాలెం, ఇందిరమ్మ కాలనీ 1మరియు 2,బాలాజీ నగర్, చీ= నగర్, SR నగర్, ఐలమ్మ నగర్,మణికంఠ కాలనీ,సాయి గణేష్ కాలనీ,సుందరయ్య నగర్,ప్రదాపరుద్ర కాలనీ,వాజ్ పాయి కాలనీ,లక్ష్మి గణపతి కాలనీ,మధిర నగర్ కాలనీలో బిఆర్ఎస్ పార్టీ హయాంలో అనేక అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 14వ మరియు 3వ డివిజన్ ప్రజలకు భద్రత దృశ్య పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. బిఆర్ఎస్ కార్యకర్తల పై పోలీసులతో అక్రమ కేసులు నమోదు చేయిస్తున్నారని విమర్శించారు. కేసులకు భయపడేది లేదని,ప్రతి కార్యకర్తకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పై గులాబీ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపూర్ కార్పొరేటర్ సిరంగి సునీల్,14వ డివిజన్ ముఖ్య నాయకులు కేతిరి రాజశేఖర్, నరసింహ, భాస్కర్, సుభాష్, రాజపోషాలు, మల్లయ్య, రాజు, యాదగిరి, అశోక్, చారి, శంకర్, అఫ్జల్, సలీం, మాధవి, సమ్మక్క,హైమావతి,వీరాచారి,కళ్యాణ్,శ్రీనివాస్,వనజ,లక్ష్మి,నవీన్,కుమారస్వామి,సాంబయ్య,తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవాణి డిగ్రీ, పిజి కళాశాలలో వార్షికోత్సవ సంబరాలు

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా మార్చి–30 వాయిస్ టుడే : నర్సయ్య పల్లి లోని విజయ ఏసి ఫంక్షన్ హాల్ ఫోటో ఫామ్ లో శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాల వార్షికోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక పాల్గొని, ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు అన్ని రకాల స్కిల్స్ పెంపొందించడానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.డిగ్రీ విద్యార్థులకు చదువుతో పాటు స్కిల్స్ కూడా ముఖ్యం, తద్వారా ఉద్యోగాలు పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. కళాశాల డైరెక్టర్ రేకులపల్లి సుష్మ మాట్లాడుతూ కళాశాలలో ఎక్కువ మంది విద్యార్థినిలు చదువుతున్నారు. విద్యార్థినులు తమ కలలు సాకారం చేసుకోవడానికి తగినట్లు పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ బండారి కమలాకర్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు సాధించిన మార్కులు , ఈ విద్యా సంవత్సరం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమాల వివరాలను వార్షిక నివేదిక లో సమర్పించడం జరిగింది. వార్షికోత్సవం నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలు గా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహుతులను అలరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బండారి కమలాకర్ బాలసాని శ్రీనివాస్, అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది..

## బార్ అసోసియేషన్‌కు నూతన అధ్యక్షుడిగా వొడ్నాల రవీందర్



సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా మార్చి-30 వాయిస్ టుడే : సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలను సోమవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. హోరాహోరీగా జరిగిన ఎన్నికలలో నలభై ఆరు మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధ్యక్ష స్థానానికి మేకల తిరుపతి రెడ్డి, వొడ్నాల రవీందర్ లు , ఉపాధ్యక్ష పదవికి ఆవుల శివకృష్ణ, మల్యాల కరుణాకర్ పోటీపడ్డారు. అధ్యక్షుడు గా వొడ్నాల రవీందర్ కి ఇరవై నాలుగు ఓట్లతో విజయం సాధించారు. ఉపాధ్యక్షుడు గా ఆవుల శివకృష్ణ కు ఇరవై నాలుగు ఓట్లతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా ఆవునూరి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా గుడ్ల వెంకటేష్, కోశాధికారిగా చీకటి సంతోష్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా వడ్లకొండ రవి కిరణ్, లైబ్రరీ కార్యదర్శిగా బొబ్బిలి శ్యాం, మహిళా ప్రతినిధి గా పి. సంధ్యారాణి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గూడూరి దివాకర్ రావు, ఆవుల లక్ష్మి రాజం, మాదూరి ఆంజనేయులు, డి, భూసారపు బాలకిషన్ ప్రసాద్, పదాల శ్రీరాములు, ఆకారపు సరోత్తం రెడ్డి జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సామల రాజేంద్ర ప్రసాద్, ఆరెల్లి రాములు, వేముల స్నేహ, మాదూరి పృథ్వీ, పూజ, ఆకారపు రామకృష్ణారెడ్డి లను ఎన్నుకున్నారు. పదాల అంజయ్య, రుద్రారపు నర్సయ్య లు ఎన్నికల అధికారుల పర్యవేక్షణ లో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఓడ్నాల రవీందర్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, సుల్తానాబాద్ కు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా గెలిచిన నూతన కార్యవర్గాన్ని శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

## జహీరాబాద్‌లో హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

ఝరాసంగం (వాయిస్ టుడే): జహీరాబాద్ పట్టణ పరిధిలోని గౌరీ ప్యాలెస్‌లో సోమవారం మధ్యాహ్నం 70 మంది హజ్ యాత్రికుల కోసం మౌజన్ గౌస్ ఆధ్వర్యంలో ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ యాత్రను పూర్తిచేసుకుని క్షేమంగా తిరిగి రావాలని, పవిత్ర భూమిలో మన దేశం మరియు ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర సుభిక్షత కోసం ప్రార్థనలు చేయాలని యాత్రికులను కోరారు. కార్యక్రమంలో జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, కౌన్సిలర్ మొహమ్మద్ జాంగిర్, మొహమ్మద్ జమీల్, మోబిన్ ఆఫీస్ సబ్ మొహమ్మద్ బాసిత్, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి... సమాజానికి మార్గదర్శకం

– జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా మార్చి–30 వాయిస్ టుడే : సమాజంలో ఎన్నో వృత్తులు ఉన్నప్పటికీ, ఒక తరాన్ని తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి అన్నిటికంటే అత్యున్నతమైనది ఉత్కృష్టమైనదని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. సోమవారం సుల్తానాబాద్ మండలం పూసాల ఎం.పి.పి.ఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలు మిరియాల సుజాత ప్రకాష్ రావు పదవీ విరమణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,సుజాత తన సుదీర్ఘ సర్వీసులో చివరి రోజు వరకు అదే నిబద్ధతతో పనిచేయడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఆమె పాటించిన సమయపాలన, క్రమశిక్షణ తో కూడిన బోధన విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిందని కొనియాడారు. విద్యార్థి క్షేత్రంలో ఉంటూ పాఠశాల అభివృద్ధి కోసం ఆమె పడ్డ తపన ప్రతి ఉపాధ్యాయునికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు.మండలంలోని ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని ఆత్మీయ సన్మానం చేశారు.ఈ వీడ్కోలు సభలో కౌన్సిలర్ సిద్ధ తిరుపతి , వేగోళం పద్మ అబ్బయ్య గౌడ్,ఎం.ఇ.ఒ ఆరేపల్లి రాజయ్య, టిఆర్ టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, కాంప్లెక్స్ హెచ్ఎం కవిత, రత్నాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి,టి ఆర్ టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు గుర్రం.శ్రీనివాస్ వివిధ సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలోని న్యాయవాదుల రక్షణకై నిన్న ప్రభుత్వము తెలంగాణ న్యాయవాదుల రక్షణ..

చట్టం-2026 శాసనసభ అమానించింది.

తెలంగాణ న్యాయవాదులుగా, ఎన్నో సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్న, సంధర్భంలో విన్నికాళ్ళ హమిలో ఇచ్చి న మడక కట్టు బడి. రాష్ట్రప్రభుత్యము స్పంధించి రక్షణ చట్టం 2025 తెచ్చినందుకు . రాష్ట్ర ప్రభుత్యం. ముఖ్యమంత్రి .ఎ. రెవంత్ రెడ్డి సి.యం. మంత్రి క్యాబినెట్ మంత్రులకు, రాష్ట్ర శాసన సన్యాలకు ఆదినందనలు తెలియ చేస్తున్నము. పులిగారి గొవర్ధహరెడ్డి, ఎ.ాణఎ. జీూజ. నూతనంగా ఎన్నుకోబడిన న్యాయవద సంఘ సభ్యులు. న్యాయవాదులు. 1త్ర. గోలి విప్లవ్ది అధ్యక్షులు . రంహారెడ్డి జిల్లాగా వడియారాం రవికుమార్ కార్యదర్శి మరియు సంఘ సభ్యులు. పీఠం ప్రనిపుకుమర్.పి. అవితకుమార్. రంచెందర్ ఇతర న్యాయవాదులు తెలిపారు.

## కరీంనగర్ ఏఆర్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన చల్లా ప్రతాప్



కరీంనగర్,మార్చి 30(వాయిస్ టుడే): పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏఆర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ గా చల్లా ప్రతాప్ అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ నుండి బదిలీపై వచ్చిన ఆయన, కరీంనగర్ కమిషనరేట్ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు.ఈ సందర్భంగా ఆయన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మార్చ్ 30: నిర్మల్ పట్టణంలోని నిర్మల్ ఐ కె ర్ క్యాంపు ఆఫీస్ లో సారంగాపూర్ మండలం తాండ్ర. జీ గ్రామానికి చెందిన ముగ్గురు సి ఎం రిలీఫ్ పండ్ బాధితులు రొడ్డ వేణి లస్మన్నకు 60.000( అరవై వేల ) రూపాయలు,కమటి గొల్ల శ్రీలత కు 60.000(అరవై వేల రూపాయలు ), కొట్టూర్ విజయలక్ష్మి ఒ/.దయాకర్ గార్లకు 38.000 ( ముప్పై ఎనిమిది ) వేల రూపాయలు వేరు వేరుగా నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి దశరథ్ రాజేశ్వర్ గారు ఐ కె ర్ క్యాంపు ఆఫీస్ లో అందజేశారు. ఈ కార్యక్రమం లో నిర్మల్ జిల్లాకాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ పోలాస మల్లేష్, కాంగ్రెస్ పార్టీ సారంగాపూర్ మండల సోషల్ మీడియ కో ఆర్డినేటర్ సాక్ పెల్లి సురేందర్ మరియు నాయకులు పుసపత్రి రవి కుమార్ పాల్గొన్నారు.



## సురక్షిత ప్రయాణమే లక్ష్యం డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

కోదాడ, వాయిస్ టుడే ప్రతినిధి టుడే ప్రతినిధి: రోడ్డు ప్రమాదాల నివారణ , డ్రైవర్ల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా రాష్ట్ర పోలీసు శాఖ చేపట్టిన “అరైవ్ అలైవ్” కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో కోదాడ పబ్లిక్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల కంటి చూపు కీలక పాత్ర పోషిస్తుందని, కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు సరిగ్గా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని తెలిపారు. మంచివారికి పోలీసు మిత్రుడిగా ఉంటామని, నేరాలు,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల కఠినంగావ్యవహరిస్తామని అన్నారు. ప్రజల రక్షణలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ పనిచేస్తుందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాలు, సైబర్ మోసాలుప్రధానసమస్యలుగా మారాయని, అపరిచితుల ఫోన్ కాల్స్, బ్లూ లింక్స్, ఓటిపి వివరాలు ఇవ్వడం వంటి వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వంటి అసాంఘికకార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు లేదా డయల్ 100 కుతెలియజేయాలని కోరారు.ఈ శిబిరంలో కోదాడకు చెందిన అశోక్, పుల్లూరి, సురభి, లక్ష్మి కంటి ఆసుపత్రుల వైద్యులు డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని 500 మందికి పైగా వివిధ వాహనాల డ్రైవర్లు సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ సీఐ శివశంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, ఎస్ఐ సుదీర్, కంటి వైద్యులు అశోక్ కుమార్, మల్లీశ్వరి, రామతులసి, రామ్ చరణ్, పోలీసు సిబ్బంది డ్రైవర్లు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

ఝరాసంగం (వాయిస్ టుడే): జహీరాబాద్ పట్టణ పరిధిలోని గౌరీ ప్యాలెస్‌లో సోమవారం మధ్యాహ్నం 70 మంది హజ్ యాత్రికుల కోసం మౌజన్ గౌస్ ఆధ్వర్యంలో ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ యాత్రను పూర్తిచేసుకుని క్షేమంగా తిరిగి రావాలని, పవిత్ర భూమిలో మన దేశం మరియు ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర సుభిక్షత కోసం ప్రార్థనలు చేయాలని యాత్రికులను కోరారు. కార్యక్రమంలో జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, కౌన్సిలర్ మొహమ్మద్ జాంగిర్, మొహమ్మద్ జమీల్, మోబిన్ ఆఫీస్ సబ్ మొహమ్మద్ బాసిత్, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి... సమాజానికి మార్గదర్శకం

– జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా మార్చి–30 వాయిస్ టుడే : సమాజంలో ఎన్నో వృత్తులు ఉన్నప్పటికీ, ఒక తరాన్ని తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి అన్నిటికంటే అత్యున్నతమైనది ఉత్కృష్టమైనదని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. సోమవారం సుల్తానాబాద్ మండలం పూసాల ఎం.పి.పి.ఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలు మిరియాల సుజాత ప్రకాష్ రావు పదవీ విరమణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,సుజాత తన సుదీర్ఘ సర్వీసులో చివరి రోజు వరకు అదే నిబద్ధతతో పనిచేయడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఆమె పాటించిన సమయపాలన, క్రమశిక్షణ తో కూడిన బోధన విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిందని కొనియాడారు. విద్యార్థి క్షేత్రంలో ఉంటూ పాఠశాల అభివృద్ధి కోసం ఆమె పడ్డ తపన ప్రతి ఉపాధ్యాయునికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు.మండలంలోని ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని ఆత్మీయ సన్మానం చేశారు.ఈ వీడ్కోలు సభలో కౌన్సిలర్ సిద్ధ తిరుపతి , వేగోళం పద్మ అబ్బయ్య గౌడ్,ఎం.ఇ.ఒ ఆరేపల్లి రాజయ్య, టిఆర్ టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, కాంప్లెక్స్ హెచ్ఎం కవిత, రత్నాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి,టి ఆర్ టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు గుర్రం.శ్రీనివాస్ వివిధ సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ హైవే పై ఆశా వర్కర్లు మక్తల్ అంబేద్కర్ చౌక్‌లో రాస్తారోక్

ప్రజాస్వామ్య పరిరక్షణ
హామీ ఏమైంది : సిఐటియు

గోవింద్ రాజ్ సిఐటియు జిల్లా అధ్యక్షులు



మక్తల్ మార్చ్ 30 వాయిస్ టుడే ప్రతినిది: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ లతోపాటు,7 వ హామీగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని హామీ ఇచ్చిందని, కానీ ప్రజాస్వామ్య పరిరక్షణలో దారుణంగా విఫలమైందని CITU జిల్లా అధ్యక్షుడు సి ఆర్ గోవింద్ రాజ్ అన్నారు. చలో హైదరాబాద్ సందర్భంగా హైదరాబాద్ కు వెళ్లిన ఆశా కార్యకర్తలపై లాఠీ ఛార్జ్ చేయడానీ నిరసిస్తూ సోమవారం మక్తల్ పట్టణ కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆశా కార్యకర్తలకు 18 వేల రూపాయల ఫిక్స్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందని హామీలు అమలు చేయమని ప్రశ్నిస్తే ఆశా కార్యకర్తలపై అత్యంత నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు .తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించిన ఆశలపై, రాష్ట్ర నాయకులపై నియంత్రత్వంగా వ్యవహరించి లాఠీచార్జ్ చేయడమే కాకుండా రాత్రి వరకు ఆడపడుచులను పోలీస్ స్టేషన్లో పెట్టి నిర్బంధించిందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని ఏడవ హామీగా చెప్పిన కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇచ్చిందని విమర్శించారు. కార్మిక వర్గ పోరాటాల పట్ల బాధ్యతరాహితంగా వ్యవహరించిన ఏ ప్రభుత్వము మనుగడ సాధించిన దాఖలాలు లేవన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి మిస్సింగ్ కార్యదర్శి, పుంజనూరు ఆంజనేయులు సిఐటియు మాజీ జిల్లా ఉపాధ్యక్షులు, భరత్ సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయమని అడిగితే ఆశా కార్యకర్తల ఇళ్ల దగ్గరికి వచ్చి అక్రమంగా అరెస్టులు చేయడమే కాకుండా మంచినీళ్లు కూడా ఇవ్వకుండా పోలీస్ స్టేషన్లను నిర్బంధించారని విమర్శించారు. తమను విస్మరించి తమ పోరాటాలను అణచివేసిన గత ప్రభుత్వానికి ఏ గతి పట్టిందో గుర్తుతెరగాలని హెచ్చరించారు. తమకు ఫిక్స్ వేతనం 18000 ఇచ్చేంతవరకు, అదనపు పని భారాలు తగ్గించాలని, మట్టి ఖర్చులకు 50,000, ఇన్సూరెన్స్ 50 లక్షల చెల్లించేంతవరకు తమ పోరాటం ఆగిబోదని తక్షణమే ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలో ఆశాలకు ప్రత్యేక నిధుల కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు గోవిందమ్మ, గౌరమ్మ, యశోద, అమీనా బేగం, ఇందిరా, అనురాధ, సుజాత, లక్ష్మి, నర్సింగమ్మ, వెంకటలక్ష్మి, పార్వతమ్మ, సునీత పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**